

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక


జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162


**మీకు మహిళల ఉసురు తగులుతుంది: విపక్షాలపై అమిత్ షా ఫైర్**




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 108 | శనివారం 18 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3





# రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

2లో

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది.




- ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ 'మాయగాడు' వ్యాఖ్యలు
- లోక్‌సభలో తీవ్ర దుమారం.. క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్
- 'ఆపరేషన్ సిందూర్'ను కించపరిచారని ప్రభుత్వ వర్గాల ఆగ్రహం
- వివాదాస్పద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్ ఓం బిర్లా
- సైన్యం వెనుక దాక్కోవద్దంటూ బీజేపీపై రాహుల్ ఘాటు ప్రతిదాడి

2లో

# మాయగాడు

## వ్యాఖ్యల దుమారం.. బీజేపీ తీవ్ర ఆగ్రహం

## శాస్త్రిపురం ప్లై ఓవర్ ప్రారంభం

**ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. 2లో



## మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం

మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం

ఎంపిలకు ప్రధాని మోడీ పిలుపు

2లో



## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో



## మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?: జగన్



మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును వ్యతిరేకించిన పార్టీలపై జగన్ విమర్శలు

ఈ పరిణామంతో మహిళలకు, దక్షిణ రాష్ట్రాలకు న్యాయం జరగలేదని వ్యాఖ్య

2026 జనాభా లెక్కలతో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి నష్టమని ఆందోళన

కుటుంబ నియంత్రణ పాటించినందుకు శిక్ష అనుభవించాల్సి వస్తోందని పోస్ట్



# స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు సమీక్ష...

## అధికారులకు కీలక ఆదేశాలు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురోగతిపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమావేశం

100 శాతం ఇంటింటి చెత్త సేకరణ, శుద్ధి జరగాలని ఆదేశం

అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం

హాస్టళ్లలో తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రత్యేక మార్గదర్శకాలు

పచ్చదనం పెంపు, సోలార్ రూఫ్‌టాప్‌లపై దృష్టి సారించాలని సూచన

'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమ పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు.



## మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల

వీగిపోయింది డీలిమిటేషన్ బిల్లేనని, మహిళా బిల్లు కాదని వ్యాఖ్య

విపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ

2023లో ఆమోదం పొందిన బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్

543 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం కోటా వర్తింపజేయాలని సూచన

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు. మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా

## మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?: జగన్

మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన పార్టీలు తాము ఏం సాధించాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందకపోవడం వల్ల మహిళలకు, దక్షిణ భారత రాష్ట్రాలకు ఏకకాలంలో అన్యాయం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026కు మూడింట రెండొంతుల మెజారిటీ లభించని నేపథ్యంలో జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేపడితే దక్షిణ రాష్ట్రాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసలు వాళ్లు ఏం సాధించారు? వాస్తవ పరిస్థితి చూస్తే, దక్షిణాది రాష్ట్రాల సంఖ్యాబలం (సీట్లు) తగ్గిపోతుంది, మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా వాయిదా పడింది. దీనివల్ల దక్షిణాదికి న్యాయం జరగలేదు, మహిళలకూ న్యాయం అందలేదు.ఒకవేళ 2026లో జనాభా లెక్కలు తీస్తే, దక్షిణాది పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. కుటుంబ నియంత్రణ విషయంలో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను మరింతగా శిక్షించినట్లు అవుతుంది. జనాభాను నియంత్రించిన పాపానికి మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ఎంతవరకు సమంజసం? ఇది దక్షిణాదిపై చూపిస్తున్న వివక్ష కాదా? రాజకీయ పార్టీలు ఈ అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉంటున్నాయో అర్థం కావడం లేదు" అని జగన్ ట్వీట్ చేశారు.

## మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల

విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో వెంటనే 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, తమ నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

## మీకు మహిళల ఉసురు తగులుతుంది: విపక్షాలపై అమిత్ షా ఫైర్

**లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ**

**విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ**

**కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం**

**ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు**

మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

# పేదల ఇళ్లపై సౌర వెలుగులు

విద్యుత్ వినియోగం పెరుగుతోంది. అంతకంతకు బిల్లులు భారమవుతున్నాయి. అందుకే సోలార్ విద్యుత్‌కు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ సోలరైజేషన్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానళ్లను ప్రభుత్వం అందించనున్నది. జిల్లాలో ప్రతీ ఒక్క ఇంటికి సోలార్ వెలుగులు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వం ఆదేశాల మేర అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం అందుతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం యాథావిధిగా కొనసాగుతోంది. ఉత్పత్తి అయిన విద్యుత్ గ్రాస్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. ఈ సోలార్ కాల పరిమితి 25 ఏళ్లు. దీనివల్ల విద్యుత్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా 55,733 మంది ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులుండగా 22,855 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతానికి 304 మందికి సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు. మరో 2100 మందికి ప్రోసెస్‌లో ఉన్నాయి. జూన్ నెలాఖరు పూర్తి కావాల్సి ఉంది. బీసీల కోసం కేంద్రం ఇచ్చే రాయితీకి అదనంగా రూ.20 వేల రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రెండు కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే బీసీలకు మొత్తంగా రూ.80 వేల వరకు రాయితీ వస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి

జాన్ వెస్లీ, నగర పంచాయతీ కౌన్సిలర్, ఆకివీడుఎస్సీ, ఎస్టీలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు చెల్లింపు ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఈ పథకం వల్ల అందరికీ లాభమే. బిల్లులఖర్చు తగ్గుతుంది. మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలుగుతుంది.

అపోహలు నమ్మకండి రత్నాకర్, విద్యుత్ ఏఈ, ఆకివీడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఈ పథకం షెడ్యూల్ కులాలు, తెగలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. మేడపైన వేసుకుంటే సమస్యలు తలెత్తుతాయనే వస్తున్న మాటలు నమ్మకండి. ప్రస్తుతానికి ఆకివీడు మండలంలో 650 మందిని గుర్తించగా 170 మంది లబ్ధిదారులు సోలార్ ప్యానల్స్ వేయించుకున్నారు. రాయితీ లేకపోయినా ప్రజలందరూ సోలార్ వినియోగించుకుంటే విద్యుత్ ఆదా చేసుకోవచ్చు. బిల్లుల ఖర్చు తగ్గుతుంది



## వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ పక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

## లోక్‌సభలో రాహుల్ 'మాయగాడు'

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు శుక్రవారం తీవ్ర గందరగోళానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వివాదాస్పద బిల్లులపై జరిగిన చర్చలో, ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి పరోక్షంగా చేసిన 'మాయగాడు' వ్యాఖ్యలు పార్లమెంటులో పెను దుమారాన్ని రేపాయి. రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటును, 140 కోట్ల మంది ప్రజలను అపహాస్యం చేయడమేనని ఆరోపిస్తూ, ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో వాడివేడి వాగ్వాదాలు, నిరసనలు చోటుచేసుకున్నాయి. చర్చలో భాగంగా రాహుల్ గాంధీ తన బాల్యంలోని కొన్ని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు తాను చూసిన ఒక గారడీ ప్రదర్శనను ప్రస్తావిస్తూ, అందులో ఒక ట్రిక్ విఫలమవడంతో ఆ మెజీషియన్ ప్రదర్శన ముగిసిపోయిందని అన్నారు. ఈ బిల్లులు నెగ్గవని బీజేపీకి తెలిసినా, దేశ ఎన్నికల స్వరూపాన్ని మార్చడం, తాను మహిళా పక్షపాతినని చాటుకోవడం అనే రెండు సందేశాలను ప్రధాని ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో "బాలాకోట్ మాయగాడు, డీమానిటైజేషన్ మాయగాడు, సిందూర్ మాయగాడు అకస్మాత్తుగా పట్టుబడ్డాడు" అంటూ రాహుల్ పదునైన వ్యాఖ్యలు చేయడంతో బీజేపీ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ సిందూర్'ను గారడీగా అభివర్ణించి రాహుల్ గాంధీ సాయుధ బలగాలను, దేశాన్ని అవమానించారని, ఆయన వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, ఆ వివాదాస్పద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటరీ భాషను ఉపయోగించాలని రాహుల్‌కు సూచించారు. స్పీకర్ సూచనతో రాహుల్ తన 'మాయగాడు' వ్యాఖ్యలను పక్కనపెట్టినా, ప్రభుత్వంపై దాడిని మాత్రం ఆపలేదు. దేశాన్ని రక్షించే సాయుధ బలగాలు తామేనని బీజేపీ భావిస్తోందని, సాయుధ బలగాల వెనుక పిరికిపందల్లా దాక్కోవడం ఆపాలని ఆయన హితవు పలికారు. అంతకుముందు, తన నానమ్మ ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి వారు డీలిమిటేషన్ వల్ల తలెత్తే ప్రమాదాలను గ్రహించి, దానిని ముందుకు తీసుకెళ్లలేదని రాహుల్ గుర్తుచేశారు.

## శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్‌ఎంసీ నిర్మించింది. జీహెచ్‌ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ్‌÷÷-లఓల్ల÷వర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

## మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నిం టినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే పక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు.నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్య్రం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి' అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు.శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# అమెరికాపై ట్రంప్ దురాగతాలు!

జాతుల, సమాజాల భవితవ్యాలను నిర్మించడంలో వ్యక్తుల పాత్రకు తక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వడం చరిత్రకారులకు పరిపాటి. బ్రిటిష్ చరిత్రకారుడు ఈ.హెచ్.కార్ తన 'చరిత్ర అంటే ఏమిటి?' అన్న పుస్తకంలో చరిత్రను 'మంచి', 'చెడు' వ్యక్తుల కథలుగా కుదించివేసే చరిత్ర రచనా పద్ధతిని తిరస్కరించారు. చరిత్ర అనేది కేవలం నిష్పాక్షిక వాస్తవాల సమాహారం కాదని, అది వర్తమానానికి, గతానికి మధ్య జరిగే ఒక 'అంతులేని సంభాషణ' అని, అది తరచుగా చరిత్రకారుడి సొంత దృక్పథం ద్వారా రూపు దిద్దుకుంటుందని కార్ వాదించారు. 'మానవులు తమ చరిత్రను తామే సృష్టించుకుంటారు, కానీ వారు దానిని తమకు నచ్చినట్లుగా సృష్టించుకోరు. వారు దానిని తాము ఎంచుకున్న పరిస్థితులలో కాకుండా ఇప్పటికే ఉన్న, గతం నుంచి ఇవ్వబడిన, సంక్రమించిన పరిస్థితులలో సృష్టించుకుంటారు' అని కార్ల్ మార్క్స్ అన్నారు. అయినప్పటికీ కొన్ని సందర్భాలలో వ్యక్తులు మంచికో, చెడుకో చరిత్ర నిర్మాణంలో కీలక, నిర్ణయాత్మక పాత్ర వహిస్తారు. మనం నివసిస్తున్న ఈ కాలపు చరిత్రను ప్రభావితం చేస్తున్న వ్యక్తులలో డోనాల్డ్ ట్రంప్ మరెవ్వరి కంటే ప్రముఖుడు. అమెరికా అధ్యక్షుడిగా ఆయన ఉత్థానాన్ని విస్తృత ఆర్థిక వ్యవస్థలో విస్తృత మార్పులు, సాంకేతికతల్లో వినూత్న పురోగతి నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ పర్యవసానాల పట్ల శ్వేతజాతి అమెరికన్ కార్మిక శ్రేణుల్లో తీవ్ర నిరాశానిరుత్సాహాలు నెలకొనడంతో పాటు నవ నవీన వార్తా మాధ్యమాలు సుసాధ్యం చేసిన విశేష ప్రచారం లేని పక్షంలో డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికయ్యేవాడే కాదు. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత కోట్లాది వ్యక్తుల అదృష్ట దురదృష్టాలను అతడు నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్నాడు. 2026లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ కాకుండా మరో వ్యక్తి ఉన్నట్టయితే ఇజ్రాయెల్ ప్రోద్బలంతో అమెరికా పశ్చిమాసియాలోని ఇరాన్ పైకి యుద్ధానికి వెళ్లి ఉండేదేకాదు. అపార ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించి ఉండేది కాదు. అలాగే పశ్చిమాసియా వెలుపలి దేశాలలో చమురు, వంటగ్యాస్, ఎరువుల ధరలు పెరిగి ఉండేవే కావు. ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధానికి దిగడం ద్వారా ప్రపంచానికి ట్రంప్ చేసిన చెరుపు కంటే, పదిహేను నెలల క్రితం రెండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అతడు తన సొంత దేశానికి చేసిన హానిపై ఈ కాలమ్‌లో దృష్టి పెట్టదలుచుకున్నాను. 'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తాను' అని హామీ ఇచ్చిన ట్రంప్, అదే దేశాన్ని అనేక విధాలుగా బలహీనపరిచాడు. కనీసం ఏడు ముఖ్య మార్గాలలో అమెరికాను అతడు భ్రష్టపరిచాడు. ట్రంప్ తన దేశానికి వ్యతిరేకంగా పాల్పడిన దురాగతాలలో మొదటిది ప్రభుత్వ పరిధిలో విధాన నిర్ణయాలు తీసుకునే ప్రక్రియపై దాడి. అమెరికా అధ్యక్షుడు వెస్ట్ మినిస్టర్ తరహా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధానమంత్రి కంటే సాంకేతికంగా మహా శక్తిమంతుడే అయినప్పటికీ విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఇతరులను తప్పనిసరిగా సంప్రదించవలసి ఉంటుంది. అయితే ట్రంప్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునేందుకు, ఏకపక్షంగా వ్యవహరించేందుకే ప్రాధాన్యమిచ్చాడు. జాతీయ చట్టసభ కాంగ్రెస్‌ను బేఖాతర్ చేయడంతో పాటు సొంత కేబినెట్‌ను సైతం విశ్వాసంలోకి తీసుకోకుండానే నిర్ణయాలు చేయడం ఆయనకు పరిపాటి అయింది. వెనెజువెలా, ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రకటించడమే అందుకు నిదర్శనం. అమెరికాపై ట్రంప్ దాడులలో రెండోది నిష్పక్షపాత కార్యనిర్వాహక శాఖ అనే భావన పట్ల బద్ధ వ్యతిరేకత చూపడం. న్యాయశాఖను తన ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఉపయోగించడమే ఇందుకు నిదర్శనం. చట్టం ప్రకారం నడుచుకున్న నిజాయితీపరులు అయిన అధికారులను సైతం వేధించేందుకు న్యాయశాఖను ట్రంప్ దుర్వినియోగపరిచాడు. తన విధానాలతో ఏకీభవించని పౌరులను బెదిరించేందుకు డెమొక్రాట్ల పాలనలో ఉన్న రాష్ట్రాలకు ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్లను ట్రంప్ నిరంతరాయంగా పంపుతున్నాడు. యుక్తాయుక్త విచక్షణ, న్యాయనిష్ఠతో కాకుండా పగ తీర్చుకోవడం, ప్రతీకారానికి పాల్పడడానికే ట్రంప్ పాలన ప్రాధాన్యమిస్తోంది. కక్షలు, కార్పణ్యాలు ఆయన నిర్ణయాలను బాగా ప్రభావితం చేస్తున్నాయి. ట్రంప్ తన దాడులలో అమెరికా సైన్యాన్ని సైతం మినహాయించలేదు. ఇది అమెరికాకు వ్యతిరేకంగా ఆయన మూడో దురాగతం. చట్టం ప్రకారం అధ్యక్షుడి నుంచి సైనికాధికారులు ఆదేశాలు తీసుకోవలసి ఉంటుంది. సైనిక వృత్తిలో ఉన్నవారు ఏ ఒక్క నిర్దిష్ట రాజకీయవేత్తకే కాకుండా ఏ రాజకీయ పార్టీ పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించడం పూర్తిగా నిషిద్ధం. ఈ సంప్రదాయాన్ని ట్రంప్ ఉల్లంఘించాడు. తన పుట్టినరోజు సందర్భంగా వాషింగ్టన్‌లో సైనిక కవాతును నిర్వహించాడు. ఇటీవల సైనిక దళాల ప్రధాన అధికారికి ఉద్వాసన చెప్పేందుకు తన రక్షణ మంత్రికి ట్రంప్ అనుమతినిచ్చాడు. జెండర్, జాతి వివక్షలకు తావు లేకుండా సైనిక దళాలలో ప్రమోషన్లను ప్రోత్సహించడమే బర్తరఫ్ అయిన ఆర్మీ చీఫ్ నేరమయిపోయింది!ట్రంప్ దాడులలో నాల్గవది పత్రికా స్వాతంత్ర్యంపై జరుగుతోంది. తనకు, తన పాలనా విధానాలకు అనుకూలంగా వ్యవహరించాలని పలు మీడియా సంస్థల యజమానుల (ముఖ్యంగా వాషింగ్టన్ పోస్ట్ యజమాని జెఫ్ బెజోస్)ను ట్రంప్ బెదిరించాడు. మీడియా సంస్థలను కొనుగోలు చేసేందుకు కోటీశ్వరులు అయిన తన స్నేహితులను ప్రోత్సహిస్తున్నాడు. సీబీఎస్ ఇలానే చేతులు మారింది. జగద్విఖ్యాత అమెరికా విశ్వవిద్యాలయాలపై ట్రంప్ ఐదో దాడి జరుగుతోంది. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు ఉద్యమించడం పట్ల ట్రంప్ అగ్రహోదగ్రుడు అయ్యాడు. పలు విశ్వవిద్యాలయాలకు ఫెడరల్ నిధులు నిలిపివేశాడు. అన్ని విశ్వవిద్యాలయాలు తన రాజకీయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ట్రంప్ హుకుం జారీచేశాడు. అంతర్జాతీయంగా తమకు ఎనలేని పేరు ప్రతిష్ఠలు సమకూర్చిన విద్వత్ సంప్రదాయాలు, విలువలకు తిలోదకాలు ఇవ్వక తప్పని విపత్కర పరిస్థితిని అమెరికన్ విశ్వవిద్యాలయాలకు ట్రంప్ కల్పించాడు. అత్యంత విశ్వసనీయమైన మిత్రదేశాల పట్ల దురహంకారపూరితంగా వ్యవహరించడం ట్రంప్ దురాగతాలలో ఆరవది. పొరుగున ఉన్న కెనడాతో అమెరికాకు మొదటి నుంచీ ప్రశస్త, ఆత్మీయ సంబంధాలు ఉన్నాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చీ రాక ముందే ఆ మిత్రరాజ్యంతో వాణిజ్య సమరానికి తలపడ్డాడు. బలవంతంగా కలుపుకునే ప్రయత్నాలకూ నాంది పలికాడు. కెనడా ప్రధానమంత్రిని అమెరికా 51వ రాష్ట్ర గవర్నర్‌గా పరిగణిస్తున్నట్టు ప్రకటించాడు. ట్రంప్ ఇప్పుడు కెనడాను పరిహసించే, చిన్నబుచ్చే వైఖరులకు తాత్కాలికంగా స్వస్తి చెప్పాడు. అయితే నాటో సభ్య దేశాల పట్ల దౌత్య మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని ట్రంప్ కొనసాగిస్తున్నాడు. యూరోపియన్ దేశాల విధానాల పట్ల ట్రంప్ వ్యతిరేకత ఆ దేశాల నాయకుల పట్ల ఆయన వ్యక్తిగత ద్వేషంగా పరిణమించింది. పలువురు యూరోపియన్ నాయకులను ముఖ్యంగా బ్రిటన్, స్పెయిన్ ప్రధానమంత్రులను బహిరంగంగా చులకన చేసేందుకు కూడా ట్రంప్ వెనుకాడడం లేదు. అమెరికా అధ్యక్ష పదవి ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలను ఉద్దేశపూర్వకంగా బలహీనపరచడం కూడా ట్రంప్ దురాగతాలలో ఒకటిగా పేర్కొని తీరాలి. తన సోషల్ మీడియా పోస్టులో ఉపయోగిస్తున్న సంస్కార రహిత భాష, చేస్తున్న దుర్భాషలు.. తన కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఆర్థిక లబ్ధిని సమకూర్చేందుకు అధ్యక్ష పదవీ అధికారాలను దుర్వినియోగం చేయడంలో అది స్పష్టంగా కనిపిస్తోంది. మొరటుతనం, అవినీతిలో ట్రంప్ తన పూర్వ అధ్యక్షుల నందరినీ మించిపోయాడు. మరింత స్పష్టంగా చెప్పాలంటే అమెరికా అధ్యక్ష పదవి ప్రతిష్ఠను బాగా దెబ్బతీశాడు. రెండో రాకడ అనంతరం ట్రంప్ తన సొంత దేశానికి వ్యతిరేకంగా పాల్పడిన దాడులు, దురాగతాలకు ఇవన్నీ దృష్టాంతాలు. తాను ఎంతగానో ప్రేమించే దేశానికి, మళ్లీ ప్రపంచ గొప్ప శక్తిగా నిలబెడతానని వాగ్దానం చేసిన దేశానికి ట్రంప్ మూలంగా వాటిల్లిన నష్టాన్ని అవి సూచనప్రాయంగా వెల్లడిస్తాయి. మొత్తం మీద అమెరికాను ట్రంప్ బలహీనపరిచాడు. ఎన్నడూ లేని విధంగా అమెరికాను తక్కువ గౌరవాస్పద దేశంగా దిగజార్చాడు. మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ట్రంప్ తరచూ మొండిగా, విడ్డూరంగా వ్యవహరించేవాడు. రెండోసారి అధ్యక్షుడు అయిన తరువాత అతడి చర్యలు ప్రమాదకరమైనవిగానూ, దురాశాప్రేరితంగానూ ఉంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ప్రథమ, ద్వితీయ అధ్యక్ష పదవీ కాలాల మధ్య విరామంలో ట్రంప్, అతడి సలహాదారులు ఇతర నిరంకుశ పాలకుల తీరుతెన్నులను నిశితంగా అధ్యయనం చేసి, ఇప్పుడు వాటిని అమలుపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని నేను విశ్వసిస్తున్నాను. హంగరీలో ఓర్బాన్, తుర్కియేలో ఎర్డోగన్, ఇజ్రాయెల్‌లో నెతన్యాహు... సరే, మన నరేంద్ర మోదీ

# ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ పై క్షుద్రపూజలు.



**నన్ను హతమార్చడానికే ఇలాంటి ప్రయత్నాలు.**
**గతంలో ఎన్నిసార్లు ఇలా చేశారు.**
**సి.సి.కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు మీరే చూడండి.**
**బాడీ బిల్డర్ కరిముల్లా,అతని వెనకవుండే వారి పనే ఇది.**
**పోలీసులు న్యాయం చేయండి.**

నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 17 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణ శివారులోని ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ పై కొందరు క్షుద్రపూజలు చేసిన సంఘటన వెలుగుచూసింది.సి.సి కెమెరాల్లో రికార్డు కావడంతో అసలు విషయం బయటపడింది.సి.సి.కెమెరాలు,తన కార్యాలయం వద్ద చల్లిన వస్తువులు చూసి భయపడిన జాకీర్ హుస్సేన్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఈ సందర్భంగా ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ మీడియా తో మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటుకు ఎంతో కృషి చేశానన్నారు.గతంలో పట్టణంలో మెకానిక్ దుకాణాలు ఉండేవని,ఎందరో అటు,ఇటు తిరుగుతూ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందేవారన్నారు.ఆటో నగర్ ఏర్పాటు చేస్తే అందరికీ వ్యాపారాలతో పాటు మృత్యువాత పడరనే ఉద్యేశంతో అందరి మేలు కోరి ఆటో నగర్ ను ఏర్పాటు కు కొందరి పెద్దల సహకారంతో చేశానన్నారు.ఆటో నగర్ ఏర్పాటు కావడంతో అందరి కోరిక మేరకు ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారన్నారు.ఆటోనగర్ లో 14 ఏళ్లుగా అందరి సమస్యలు పరిస్కరిస్తున్నానన్నారు.కొందరు నాపై కక్షపెంచుకొని గతంలో ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారన్నారు.ప్రాణారక్షణ కోసం నా కార్యాలయం వద్ద సి.సి.కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాను అన్నారు.నన్ను ఎలాగైనా ఇబ్బందిపెట్టాలని బాడీ బిల్డర్ కరిముల్లా రాత్రి సమయంలో ఎవరు లేరని చూసి నా కార్యాలయం ముందు క్షుద్రపూజలకు వాడే వస్తువులు చల్లింది సి.సి.కెమెరాల్లో రికార్డు అయిందన్నారు.ఉదయం నా కార్యాలయం వద్దకు వచ్చి చూడగా అక్కడ కొన్ని వస్తువులు కనిపించడంతో బయపడి పోలీసులకు సమాచారం ఇచ్చానని మీడియా ముందు



పేర్కొన్నారు.ఇలాంటి క్షుద్రపూజల ప్రయత్నం చేసిన బాడీ బిల్డర్ కరిముల్లా తో పాటు అతని వెనుక ఎవరెవరు ఉన్నారో పోలీసులు దర్యాప్తి చేసి నా ప్రాణాలు కాపాడాలని మీడియా ముందు వేడుకున్నారు.ఇప్పటికే ఆటో నగర్ రెండు వర్గాలు కావడం ఇప్పుడు జరిగిన సంఘటన ఎలాంటి మలుపులు తిరుగుతుందో అర్థం కానీ పరిస్థితి.జరగరాని సంఘటనలు జరగక ముందే పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని మేధావులు పేర్కొంటున్నారు.

# శ్రీశైలం దేవస్థానంలో అంకాళమ్మ వారికి విశేష పూజలు



**శ్రీశైలం ఏప్రిల్ 17(నంది పత్రిక)** లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి (17.04.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చక స్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 17 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పరమటూరు గ్రామంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శుక్రవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ జొన్నల కొనుగోలు కేంద్రంలో క్వింటా 3699 రూపాయల మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఒక ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడితో గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఒక రైతుకు సివిల్ సప్లై శాఖ డి సి ఎం ఎస్ సొసైటీ ద్వారా కొనుగోలు చేస్తారని చెప్పారు. బండి ఆత్మకూరు మండలంలో జొన్న 2528 ఎకరాలు సాగు చేయగా 7230 క్వింటాళ్ల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. హమాలి చార్జీలు 24.06 క్వింటాకు ప్రభుత్వం ఇస్తుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. రైతులందరూ జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, సివిల్ సప్లైస్ డి ఎం అశ్వత్థ నాయక్, డీసీఎంఎస్ డి ఎం రాజీవ మౌలాలి, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు సురేష్, ప్రభాకర్, పరమటూరు తెలుగు యువత నాయకులు రేగటి రాజశేఖర్ రెడ్డి తోపాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు రైతులు పాల్గొన్నారు.



# ఎన్జీఓ కాలనీ తల్లి,ఇద్దరు పిల్లల ఆత్మహత్యకేసులో ట్విస్ట్.



**మా బావ,వారి కుటుంబసభ్యులు విషం ఇచ్చి చంపారంటూ బావమరిది ఆరోపణలు.**
**చెల్లెలు సుధా మల్లిక శరీరంపై తీవ్రగాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం లో వెల్లడి.**
**న్యాయవ్యవస్త,పోలీస్ శాఖ న్యాయం చేయండి.**
**రాజకీయ,డబ్బు,పలుకుబడితో మా బావ బెదిరిస్తున్నారు.**
**కోట్ల డబ్బులు ఇస్తా...రాజీకి రమ్మని మెసేజ్లు.**
**ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,హోమ్ మంత్రి వంగలపూడి అనిత రాక్షస బావకు,కుటుంబసభ్యులకు శిక్ష వేయించండి.**
**మృతురాలి తమ్ముడు కార్తీక్.**

నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 17 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణం ఎన్జీఓ కాలనీలో జరిగిన తల్లి,ఇద్దరు పిల్లల ఆత్మహత్య కేసు ట్విస్ట్ గా మారిపోయింది.నంద్యాలలో జనవరిలో జరిగిన ఈ సంఘటన సంచలనంగా మారింది.ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న మల్లికా సుధా,పిల్లలు ఆరేళ్ల ఈశాన్ సాయి,ఆరు నెలల పసికందు పరిమళ ఆత్మహత్య చేసుకున్నారని విషయం విదితమే.దేవుడు ఉన్నాడు...చేసిన పాపం దాగదు అని నిరూపణకు బలం ఇచ్చే పోస్టు మార్టం నివేదిక నిందితుల క్రూరత్వాన్నీ బయటపెట్టింది.పోస్ట్ మార్టం నివేదికలో మృతురాలి శరీరంపై పదికి పైగా గాయాలు ఉన్నట్టు గుర్తించారు.ఈ నేపథ్యంలో మృతురాలు సోదరుడు కార్తీక్ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంచలన విషయాలు కన్నీటిపర్యంతంతో బహిర్గతం చేశారు.ఆయన మాట్లాడుతూ నా సోదరి మల్లికా సుధాకు ముత్యాల పాడు కు చెందిన ఉదయ్ కిరణ్ తో పదేళ్ల క్రితం వివాహం జరిగిందన్నారు.మా బావ ఎరువుల అంగడి నిర్వహిస్తూ పలుకుబడి,డబ్బు ఉందన్నారు.వారి కుటుంబం సాఫీగా సాగుతూ వారికి ఆరు ఏళ్ల ఈశాన్ సాయి,ఏడు నెలల పసికందు ప్రవశితల ఉన్నారన్నారు.కొద్దిరోజులుగా వారి కుటుంబంలో చిన్న ,చిన్న గొడవలు జరిగిన సమయంలో ఇద్దరిని సర్ది చెప్పేవాడిని అన్నారు.జనవరిలో ఏమి జరిగిందో ఏమో మా అక్కా పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారనే సంచారం వచ్చిందన్నారు.అప్పుడు అందరము ఆత్మహత్య పై అనుమానాలు ఉన్నా సాక్ష్యాలు లేకపోవడంతో సైలెంట్ గా ఉన్నామన్నారు.అప్పట్లో ఆత్మహత్యగా జరిగిన వెనుక పక్కా ప్లాన్ ప్రకారం హత్య దాగివుందని కార్తీక్ సంచలన ఆరోపణలు చేశారు.ఆత్మహత్య కాదు,క్రూరంగా మా బావ,అతని కుటుంబసభ్యులు అందరూ కలిసి మా అక్కకు,అన్నెం పుణ్యం తెలియని పిల్లలకు బలవంతంగా నోటిలో పురుగుల మందు తాగించి ఆత్మహత్యగా చిత్రీకరించారని రోదిస్తూ చెప్పడం విశేషం.పోస్టుమార్టం రిపోర్టులో తన సోదరి శరీరంపై పదికి పైగా గాయాలున్నాయని పేర్కొన్నారు. ఇదంతా బయటికి ఎవరికి తెలియకుండా ఆ ఇంటిలో ఉన్న సొరంగ మార్గం గుండా వచ్చి మానవత్వం అనేది లేకుండా కట్టుకున్న భార్యను,పిల్లలను అతి కిరాతకంగా పురుగుల మందు తాగించి దారుణ హత్య చేశారని ఆరోపించారు.ఆయనకు ఉన్న పలుకుబడితో కేసును నీరు గర్చేవిధంగా చేయడానికి



ప్రయత్నం చేస్తూ,చంపేస్తామని వాట్స్ అప్ మెసేజీలు పంపిస్తున్నారని మీడియా కు చూపించారు.డబ్బు,పలుకుబడి ఉండడంతో కేసు ఉపసంహరించుకుంటే డబ్బు ఇస్తామనే ఆశ చూపిస్తూ ఒకవైపు,మరో వైపు మీ కుటుంబంలో ఎవరు మిగిలారు నాకు డబ్బు,రాజకీయ పలుకుబడి ఉందని బెదిరిస్తున్నారని న్యాయ శాఖ,పోలీస్ శాఖ మా సోదరి కుటుంబానికి న్యాయం చేసి ,మా కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని వేడుకున్నారు.ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,హోమ్ మినిస్టర్ వంగల పూడి అనిత ఇలాంటి క్రూరుడికి కటినంగా శిక్షించాలని కోరారు.




# మధులోహితను అభినందించిన ఎమ్మెల్యే బుడ్డా



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 17:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న వెంగల్ రెడ్డి పేట గ్రామానికి చెందిన మధు లోహితను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అభినందించారు. మధులోహిత బండి ఆత్మకూరులోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ ఇటీవల వెలువడ్డ ఫలితాలలో రాష్ట్రంలోని 163 ఆదర్శ పాఠశాలల్లో స్టేట్ టాపర్గా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మధులోహిత తో పాటు వారి తల్లిదండ్రులు వెంకటాపురం శ్రీనివాసులు, లక్ష్మీ జయంతిలను బుడ్డా రాజశేఖర్ రెడ్డి శుక్రవారం వేల్పనూరు గ్రామానికి రప్పించుకున్నారు. మధులోహితను శాలువాతో సన్మానించి సత్కరించి అభినందించారు. మధులోహిత ఉన్నత చదువులు చదివేందుకు తనవంతు సహకారం ఉంటుందని బుడ్డా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాల యాజమాన్యాన్ని కూడా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంగల్ రెడ్డి పేట గ్రామానికి చెందిన శ్రీనివాసులు తో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంగల రెడ్డి పేట గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మధు లోహితను సన్మానించారు.



# ఆత్మకూరు పట్టణంలోని లలితా కోచింగ్ సెంటర్ లోని పేద విద్యార్థిని విద్యార్థులకు పాలీసెట్ మెటీరియల్ పంపిణీ...



ఆత్మకూరు పట్టణంలోని లలితా కోచింగ్ సెంటర్ లో పాలిసెట్ ఉచిత కోచింగ్ తీసుకుంటున్న టువంటి పేద విద్యార్థిని విద్యార్థులకు డాక్టర్. జి.సురేష్ బాబు( హెడ్ ఆఫ్ జనరల్ సెక్షన్) మరియు ఎం నవీన్ బాబు( లెక్చరర్) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నంద్యాల వారి సహకారముతో మాల మహానాడు నాయకులు మల్లె.ఎలీషా పెరుమాళ్ల. చెన్నకేశవులు మరియు ప్రాతకోట. రమేష్ గారి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పాలీసెట్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. లలిత కోచింగ్ సెంటర్ నందు కోచింగ్ తీసుకుంటున్న పేద విద్యార్థిని విద్యార్థులకు పాలిసెట్ మెటీరియల్ ను మాల మహానాడు నాయకులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాతకోట రమేష్ మాట్లాడుతూ లలిత కోచింగ్ సెంటర్ నందు పాలీసెట్, నీట్, ఎంసెట్, ఎంట్రన్స్ పరీక్షలకు కోచింగ్ ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు ఆత్మకూరు చుట్టుపక్కల ప్రాంతాలలో పేద విద్యార్థులు ఉన్నారని అటువంటి వారికి, ఉచితంగా పాలీసెట్ మరియు నీట్ ఎంసెట్ తక్కువ ఫీజు తీసుకోవడం పట్ల, వారిని అభినందించారు ఆత్మకూరు పట్టణంలో మొదటిసారి పాలిసెట్ ఎగ్జామ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో పాలీసెట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నంద్యాల వారు డాక్టర్ సురేష్ బాబు( హెడ్ ఆఫ్ జనరల్ సెక్షన్ ) మరియు మన స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారు. ఎంతో కృషి చేశారని అన్నారు. అదేవిధంగా ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారు ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని కూడా ఏర్పాటు చేయించాలని కోరడం జరిగింది.పంపిణీ చేసిన పాలిసెట్ మెటీరియల్ను విద్యార్థిని విద్యార్థులు బాగా చదివి మంచిర్యాంకులతో పాస్ కావాలని మాల మహానాడు నాయకులు కోరడం జరిగింది.



# ముగిసిన సెన్సస్ రెండవ విడత శిక్షణ





**మద్రిపాడు ఏప్రిల్ 17నంది పత్రిక :** నందవరం ఆదర్శ పాఠశాల నందు నిర్వహించబడుతున్న జనాభా గణన రెండవ విడత మూడు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ శిక్షణలో ఎన్యుమరేటర్లు మరియు సూపర్ వైజర్ లకు గణాంక సేకరణ విధానాలు,డిజిటల్ పరికరాల వినియోగం మరియు ఫీల్డ్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలపై ఫీల్డ్ ట్రైనర్ లు సమగ్ర అవగాహన కల్పించారు.ముగింపు కార్యక్రమంలో మండల తహశీల్దార్ అనీల్ కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన సిబ్బంది క్షేత్ర స్థాయిలో నిబద్ధతతో పనిచేసి, జనాభా గణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్ లు హరనాథ్,కలిశెట్టి రాజేంద్ర కుమార్,ఏ.ఎస్.ఓ రామ్ కిషోర్ పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ ఎన్.మౌర్య





**నగరంలోని ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో తెలిసిపోయేలా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుంది: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులులి**

**స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు: జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా ఎస్.వెంకటేశ్వర్**

**ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏర్పాటు చేసిన కెమెరాల వలన ట్రాఫిక్, క్రైమ్ మేనేజ్మెంట్ కి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది : జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**

**స్మార్ట్ సిటీ నిధులతో ఎన్.ఈ.సి, కెల్ట్రాన్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు: కమిషనర్, స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య**

**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17 :నంది పత్రిక** స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కచ్చపి ఆడిటోరియం నందు తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను శుక్రవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమీషనర్ ఎన్.మౌర్య ప్రారంభించి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో నగరంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నగరంలోని ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో తెలిసిపోయేలా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఉల్లంఘన, ఎమర్జెన్సీ, మున్సిపల్ సేవలు,, వాహనాల దొంగతనాలు, నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలు గుర్తించడం వంటి వాటికోసం ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎంత ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణ చక్కగా చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. స్మార్ట్ సిటీలైన వైజాగ్, కాకినాడ తరహాలో తిరుపతి నగరంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసి ట్రాఫిక్, శానిటేషన్, ఎమర్జెన్సీ వంటి సేవలకు ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఒక చోట నుండే నగరంలోని అన్ని ప్రాంతాల్లో జరిగేటువంటి వాటిని ఆపరేట్ చేయడానికి వీలుంటుందని తెలిపారు. నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో 360 డిగ్రీల సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సుమారు 120 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు లో 80 శాతం పనులు పూర్తయ్యాయని, రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తిరుపతి నగర ప్రజలకే కాకుండా తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు భద్రత కల్పించడానికి కూడా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తిరుమలలో ముఖ్యమంత్రి చే ప్రారంభించిన సెంటర్ తో అనుసంధానం చేస్తే స్థానిక ఆలయాలతో పాటు తిరుమల లో జరిగే ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చునని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల నుండి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చునని తెలిపారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏర్పాటు చేసిన కెమెరాల వలన ట్రాఫిక్ మేనేజ్మెంట్, క్రైమ్ మేనేజ్మెంట్ చేయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారికి పోలీస్ లేకున్నా ఆన్లైన్ ద్వారా జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. తిరుపతి, తిరుమల లో జరిగే ఉత్సవాల్లో భక్తులను కంట్రోల్ చేయవచ్చునని తెలిపారు. తిరుపతి కి వచ్చినప్పటి నుండి వెళ్లేవరకూ ప్రతి వ్యక్తి కదలికలు గుర్తించేందుకు, ప్రకృతి వైపరీత్యాల వలన వచ్చే ఇబ్బందులు ఎదుర్కొనేందుకు ఈ సెంటర్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. మునిసిపల్, పోలీస్, రెవిన్యూ విభాగాలు కలసి మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కమిషనర్, స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ నిధులతో ఎన్.ఈ.సి, కెల్ట్రాన్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. 120 కోట్లతో నగరంలోని 135 ప్రదేశాల్లో 400 సిసి కెమెరాలని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సెంటర్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ తో పాటు నగరంలో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టడం, బ్లాక్ స్పాట్స్ గుర్తించడం, కాలువల్లో, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసే వాళ్ళని, భవన నిర్మాణ వ్యర్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా జూ పార్క్ మార్గంలో చెత్త వేయడం వలన చిరుత వంటివి వస్తున్నాయని తెలిపారు. జూ పార్క్ నుండి చెర్లోపల్లి వరకు ఎవరైనా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించేందుకు 9 పి.టి.జడ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జి.ఎం.చంద్రమౌళి, ఈ.ఈ.రవి, ఎన్.ఈ.సి., కెల్ట్రాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లాలో ఉన్న ప్రతి పరిశ్రమకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉండాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక.....** పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ జాప్యం లేకుండా పన్నుల వసూళ్ల ప్రక్రియ కొనసాగాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో జీఎస్టీ కో ఆర్డినేషన్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ మార్గాలను మెరుగుపరచడంతో పాటు పన్ను వసూళ్లలో పారదర్శకతను పెంచాలన్నారు. చీ×జణజ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ కార్పొరేషన్) ఓర్వకల్ నోడ్ లో భాగంగా ఉందని, దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ లకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉందో లేదో వెరిఫై చేయాలని, అదే విధంగా జిల్లాలో ఉన్న పరిశ్రమలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకుంటున్నారో ? లేదో ? వెరిఫై చేయాలని కలెక్టర్ కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ ను ఆదేశించారు. నెడ్ క్యాప్ ద్వారా ఏర్పాటు అవ్వనున్న పవర్ కంపెనీల వివరాలు తీసుకొని జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నులు సక్రమంగా కడుతున్నారా లేదా వెరిఫై చేసి పన్ను ఎగవేత జరగకుండా చూడాలన్నారు. అరియర్స్ దాదాపు రూ.190 కోట్ల వరకు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన కలెక్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లు తీసుకునే సమయంలో ఒక బ్యాంక్ అకౌంట్ ఖాతా మాత్రమే ఇస్తారని, వారికి ఆ పాన్ నంబర్ కింద ఇతర బ్యాంక్ లో కూడా ఖాతాలు ఉండే అవకాశం ఉంటుందని, సంబంధిత పాన్ నంబర్ లను జీఎస్టీ వారితో కో ఆర్డినేట్ చేసుకొని సంబంధిత పాన్ నంబర్ కింద ఉండే బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇవ్వాలని కలెక్టర్ ఎల్ డి ఎమ్ సిబ్బందిని ఆదేశించారు.జిల్లాలో మొత్తం 38 ప్రాజెక్ట్ లకు మీాఖ చేసుకోవడం జరిగిందని, వాటిలో ఇప్పటికే 24 ప్రాజెక్ట్ లకు జీవోలు జారీ అయ్యాయన్నారు. ఇప్పటికే 35 మంది ప్రతినిధులు స్థలాలను సందర్శించి, 10 ప్రాజెక్టులకు పునాది రాళ్లు వేశారన్నారు. మిగిలిన అగస్త్య, సిగాచి, ఎలిఫ్ తదితర పరిశ్రమలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. సంబంధిత వివరాలు అన్ని కూడా ఏపీఐఐసి వారితో కో ఆర్డినేట్ చేసుకొని జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉందో లేదో వెరిఫై చేయాలన్నారు.కన్స్ట్రక్షన్ యాక్టివిటీ లో భాగంగా పంచాయతీ రాజ్, నేషనల్ హైవే కింద పని చేసే కాంట్రాక్టర్లు, ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఉన్న ఏజెన్సీలు, మున్సిపాలిటీలో ఉన్న ఏజెన్సీల కింద మొత్తం పనులు మరియు ప్రాజెక్టులు వివరాలు, జిఎస్టి నెంబర్ ఉన్నవారు ఎంతమంది, జిఎస్టి లేనివారు ఎంతమంది, మొత్తం ఎంతమంది కాంట్రాక్టర్లు ఉన్నారు అనే వివరాలు కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ కి ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (ఐఐూం) అందరూ +ూ ఎఐూ కింద రిజిస్టర్ అవ్వాలని, కాంట్రాక్టర్లు +ూ పే చేస్తున్నారో లేదో పర్యవేక్షించాలన్నారు. ఇందుకు సంబంధించి ఐఐూలకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు.కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మన జిల్లా 11% వృద్ధిని నమోదు చేసి 5వ స్థానంలో ఉందన్నారు. గత ఏడాది మనం రూ.778 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకోగా, 85% సాధించామన్నారు. +ూ సంస్కరణలు మరియు రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ, కర్నూలు జిల్లా ఇతర జిల్లాల కంటే మెరుగ్గా రాణించిందన్నారు. సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డి టీ సీ శాంత కుమారి, పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, డి ఎస్ ఓ రాజా రఘువీర్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్, కర్నూలు ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి సూచనల మేరకు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం కర్నూలు నందు గల అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్ ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న ఆహారం,వసతి సదుపాయాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పిల్లలకు ఎవరికైనా న్యాయ వాది లేకుంటే ఉచిత న్యాయ వాదిని నియమించి వారి కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చట్టంతో వివేదించబడిన బాలలకు సంబందించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయమును గురించి తెలియజేశారు. పిల్లలు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. అనంతరం ఆ కాంపౌండ్ లోనే గల జువెనైల్ జస్టిస్ బోర్డు ఆఫీస్ మరియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కార్యాలయంలను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారు పిల్లల పట్ల తీసుకుంటున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జువెనైల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ అపర్ణ, లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది నాగప్ప, అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాష, డీపీవో దివాకర్, సిడబ్ల్యూసీ చైర్మన్ జుబేదాబేగం మరియు మెంబెర్స్ ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అన్నదాతకు అండదండగా భూమా కుటుంబం

**రైతు కుటుంబాల్లో పండుగ వాతావరణం.**

**ఆరుతడికే ఇస్తామన్న అధికారులతోనే సమృద్ధిగా నీటిని సాధించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్.**

**నాడు నేడు ఎల్లప్పుడూ రైతుల సేవలో తరిస్తున్న భూమా**



**సిరివెళ్ల: (నంది పత్రిక)** ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని అన్నదాతలకు అండదండగా నాడు నేడు ఎల్లప్పుడూ భూమా కుటుంబం ఉన్నదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సిరివెళ్ల మెట్ట వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాజీ జెడ్పిటిసి యామా గుర్రప్ప నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి తదితర ప్రముఖులు సాగునీరు వరి దిగుబడులు తదితర అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరిగినటువంటి సాగునీటి సలహా మండలి సమావేశంలో ఇరిగేషన్ అధికారులు ప్రతినిధుల సమక్షంలో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి రవికి సాగునీరు అందించలేమని ఆరుతడి వేసుకోవాలని అధికారులు తెలియజేయడం పట్ల ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ రైతుల పక్షాన నిలబడి కొన్ని తుఫాన్లు కారణంగా రవి ఖరీఫ్లో దిగుబడులు తగ్గాయని రవికి సాగునీరు అందిస్తే తమ ప్రాంతాల రైతన్నలు అధిక దిగుబడులు సాధించి ఆహార ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తారన్న ఉద్దేశంతో అధికారుల సూచనలను ఏకీభవించకుండా రైతుల పక్షాన నిలబడి సమృద్ధిగా సాగునీరు అందించిన ఘనత భూమా అఖిల ప్రియ గారికి దక్కిందని అన్నారు. నాడు భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి సైతం సీడు రైతుల కోసం పత్తి రైతుల కోసం ధర్నాలు రాస్తారోకోలు చేయించి సీడ్ కంపెనీలకు తాళాలు వేయించి రైతులకు నష్ట పరిహారం అందించిన సందర్భాలను ఈ ప్రాంత రైతులు ఎప్పటికీ గుర్తుంచుకునే ఉంటారని అన్నారు. నేడు రబీ సీజన్లో భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు నీరు సమృద్ధిగా అందడం పట్ల రైతన్నలు అత్యధిక దిగుబడులు సాధించి రికార్డు సృష్టించారని అన్నారు. ఆశించిన దిగుబడులు సాధించిన కారణంగా అన్నదాత కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొన్నదని కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రైతుల కోసం ఎన్నో త్యాగాలు పోరాటాలు చేసిన భూమా కుటుంబానికి ప్రతి రైతు అండగా నిలబడి ఐక్యతను సాధించి మరింత బలపరిచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప మాట్లాడుతూ 2026 డిసెంబర్ లోపు స్థానిక సంస్థ ఎన్నికలకు ప్రభుత్వం పిలుపునిచ్చే అవకాశం ఉందని ఈ ఎన్నికల్లో భూమ వర్గానికి మద్దతు తెలిపి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని హేమ గుర్రప్ప పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి మాట్లాడుతూ కేసీ కెనాల్ 16వ లాకు కింద నేటికీ సాగునీరు వస్తున్నదని మూగజీవాలకు సైతం నీటి ఎద్దడి తలెత్తకుండా చెరువులు కుంటలు నింపినట్లు తెలియజేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు ఏప్రిల్ మాసంలో మండుతున్న వేసవిలో సైతం నీరు సమృద్ధిగా అందడం హర్షించదగ్గ విషయమని కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి తెలియజేశారు. గుంపుర మాను దీన్నే ఎంపీటీసీ కుందూరు మోహన్ రెడ్డి,సొసైటీ చైర్మన్ కొండమదుగుల శ్రీనివాసరెడ్డి మాజీ చైర్మన్ గంగా దాసరి శ్రీనివాసరెడ్డి, నీటి సంఘం ప్రతినిధులు నాగేశ్వరరెడ్డి, కమతం లక్ష్మీ రెడ్డి, చింతకుంట్ల బూసిరెడ్డి, ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి, రవీంద్రారెడ్డి బీఎండి రఫీ, పుల్లారెడ్డి, కాదరాబాదర బ్రహ్మయ్య యాదవ్, డి మురళి, సుబ్బారావు నాయకులు కార్యకర్తలు భూమ అభిమానులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని శవం

హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత విషాదకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. మూడు నెలలుగా తాళం వేసి ఉన్న ఇంట్లో శవం దొరకడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గతంలో ఒక వ్యక్తి అద్దెకు ఉండేవారు. అయితే, గత మూడు నెలలుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. అ÷–దదెదారు కనిపించకపోవడం, కనీసం ఇంటి యజమానికి అ÷–దదె కూడా చెల్లించకపోవడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఇంటి యజమాని వచ్చి తాళం విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా, ఇల్లు మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. లోపలికి వెళ్లి వెతకగా, వంటగదిలోని కిచెన్‌లో కింద గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే నేరేడ్‌మెట్ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో, అది పురుషుడిదా లేక మహిళదా అనేది కూడా ప్రాథమికంగా గుర్తించలేనంత దారుణంగా ఉంది. శవం కిచెన్ బండ కింద ఉంచడాన్ని చూస్తే, ఇది ఓ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్య అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా చంపి

అక్కడ దాచిపెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఆ ఇంట్లో నివసించిన వ్యక్తి ఎవరు..?, అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# జిల్లా జైలు ఆకస్మిక తనిఖీ చేసిన న్యాయమూర్తి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి జిల్లా కారాగారము తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్" గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్ ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో



జైలు అధికారులు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివ రామ చంద్ర రావు మరియు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయ వాది చిన్న రాందాస్,పారా లీగల్ వాలంటీర్ హేమంత్ మరియు పురుష మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు సమగ్ర అవగాహన

## లాభదాయక పంటగా అధికారుల సూచనలు



**వెలుగోడు, ఏప్రిల్ 17 (నంది పత్రిక):** నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ మరియు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో వెలుగోడు గ్రామంలో శుక్రవారం ఆయిల్ పామ్ పంట సాగుపై విస్తృత అవగాహన సదస్సు జరిగింది.సదస్సులో భాగంగా అధికారులు ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యత, సాగు పద్ధతులు, పెట్టుబడి లాభాల వివరాలు, అలాగే ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై స్పష్టంగా వివరించారు. రైతులకు ప్రాక్టికల్ అవగాహన కలిగేలా పంట నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలు కూడా తెలియజేసారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఆయిల్ పామ్ సాగు రైతులకు ఒక్క ఎకరాకు 50 మొక్కల చొప్పున ఒక సంవత్సరం వయస్సు గల నాణ్యమైన మొక్కలను ఉచితంగా అందజేస్తారు. అదేవిధంగా, ఒక హెక్టారుకు రూ.10,500 చొప్పున అంతర్పంట సాగు మరియు నిర్వహణ ఖర్చులకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఈ పంట సాగులో ముఖ్యంగా నీటి వనరులు సమృద్ధిగా ఉండటం అత్యవసరం అని అధికారులు సూచించారు. సరైన నీటి పారుదల, సరఫరా వినియోగం, సమయానుకూల సంరక్షణ పాటిస్తే మంచి దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు.ఆయిల్ పామ్ పంట నాలుగో సంవత్సరం నుండి దిగుబడి ఇవ్వడం ప్రారంభమై, సుమారు 25 సంవత్సరాల పాటు నిరంతర ఆదాయం అందిస్తుందని చెప్పారు. సగటున ఎకరానికి సంవత్సరానికి రూ.1 లక్ష నుండి రూ.1.5 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. దీని ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కలుగుతుంది.సాగు కోసం ఆసక్తి గల రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే, పతంజలి సంస్థ సిబ్బంది మరియు ఉద్యాన శాఖ ద్వారా మొక్కల సరఫరా, అందించబడుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ కే. చందన, అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి, పతాంజలి మేనేజర్ ఎస్. రమణారెడ్డి, డిప్యూటీ మేనేజర్ నాగరాజు, రైతు కాసారపు రఘుస్వామి రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పిఎఫ్ఎల్ ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.సదస్సు అనంతరం రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఆయిల్ పామ్ సాగుపై స్పష్టత పెరిగింది, రాబోయే కాలంలో ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు వస్తామని రైతులు తెలిపారు

## నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలధారజలహారతి" కార్యక్రమం నిర్వహణ

### కర్నూలు జిల్లాలో 479 గ్రామాల్లో 3435 పనుల గుర్తింపు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జలధారజలహారతి" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో జలధార – జలహారతి కార్యక్రమ నిర్వహణ పై ఇరిగేషన్ ఎస్ఈ, డ్వామా పిడితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 479 గ్రామ పంచాయతీలలో ఇప్పటివరకు 3435 పనులను గుర్తించినట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న పాత చెరువులు, కుంటలు, వాటికి అనుసంధానమైన కాలువలు, వంకలు తదితర జల వనరులను పూడికతీత చేయడం, జంగిల్ క్లియరెన్స్ నిర్వహించడం ద్వారా నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడం వంటి పనులను గుర్తించి చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చర్యల ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా చెరువుల్లో నిల్వచేసి, భూగర్భ జలాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మొత్తం గుర్తించిన పనుల్లో ఎం.ఐ. ట్యాంకులకు సంబంధించిన పనులు 380 కాగా, మిగిలిన పనులు నీటి సంరక్షణ పనులని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి, ముఖ్యంగా గ్రామ పెద్దలు, స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకు పనులను గుర్తించి, పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు నీటి ప్రవాహ దిశలు, నీరు ఎక్కువగా చేరే ప్రాంతాలు వంటి విషయాల్లో గ్రామ పెద్దలకు ఉన్న అనుభవాన్ని వినియోగించుకుంటూ, వారి సమ్మతితో ప్రణాళికలు అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం వర్షాకాలానికి ముందే అన్ని పనులను పూర్తి చేసి చెరువులు, కుంటలు నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణ లో వీబీ రామ్ జీ పథకాన్ని అనుసంధానం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాల స్థాయి సగటుగా 6.6 మీటర్ల లోతులో ఉండగా, దానిని 3.00 మీటర్ల వరకు పెంచే లక్ష్యంగా పనులను చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ చురుగ్గా పనిచేసి ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ ఈ బాల చంద్రా రెడ్డి, డ్వామా పిడి నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతికి ఆధార గ్రంథం శ్రీమద్రామాయణం

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే

### -ఐనకల్లులో ఘనంగా ముగిసిన ధార్మిక కార్యక్రమాలు





**ఆస్పరి. ఏప్రిల్ 17 . (నంది పత్రిక ):**భారతీయ సంస్కృతికి మూలాధారం శ్రీమద్రా మాయణమేనని, ఇంతటి ఉన్నతమైన మానవీయ విలువలు కలిగిన శ్రీమద్రామాయణాన్ని విద్యార్థులకు బాల్యం నుండే నేర్పి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, ఐనకల్లు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం ఈ సందర్భంగా జరిగిన ధార్మిక సభా కార్యక్రమంలో వారు ప్రసంగించారు. మూడురోజులు ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు కె. రామచంద్రాచారి, హార్మోనిష్టు యు. వీరేశ్, తబలిష్టు బి. ఉరుకుందు, యు. పవన్ కుమార్, గ్రామ పెద్దలు బోయ గోవిందు, కేశం వీరారెడ్డి, నాగన్న, వెంకటేశ్, రామాంజనేయులు, తలారి వీరసేను, వి.నాగన్న, తిక్కస్వామి, కె. రామచంద్ర, పవన్, యు. సుధాకర్, యు. రంగన్న, యు. కృష్ణమూర్తి, ఫోటో గ్రాఫర్ ఆదినారాయణ, టి. లాలప్ప, మల్లన్నతోపాటు భజన బృందం సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం భక్తులందరికీ మహాప్రసాదం అందించారు.

## హైకోర్టు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. కృష్ణ మోహన్ , జస్టిస్ కె. శ్రీనివాస రెడ్డి మరియు జస్టిస్ ఎ. హరి హర నాథ శర్మ కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా కర్నూలులోని స్థానిక ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి , పూల మెక్కలను అందజేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన నాయమూర్తి జి. కబర్ధి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది.

**కొత్తపల్లి – నంది పత్రిక:** విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని గోకవరం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు ఎం. లింగాపురం గ్రామంలో బడిపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాగాంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి తిరిగి 2026-27 విద్యా సంవత్సరానికి 6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఎన్రోల్మెంట్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తుమన్నామని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహాకరించాలని కోరారు. అదేవిధంగా తల్లిదండ్రులతో ఒప్పంద పత్రాలపై సంతకాలు కూడా సేకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, రసూల్తాన్, సురేంద్ర, ఖలిముల్లా, కిరణ్ కుమార్లు న్నారు.



## మెరిసిన విద్యా కుసుమాలు

### కేజీబీవీ మైనారిటీ కాలేజ్ విద్యార్థుల ప్రతిభ



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి**ఆదోని పట్టణంలోనీ భాస్కర్ రెడ్డి కాలనీలో ఉన్నటువంటి కేజీబీవీ మైనారిటీ కాలేజ్ విద్యార్థులు, ఇటీవ విద్యా ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి మెరిసిన విద్యా కుసుమాలుగా నిలిచారని ప్రిన్సిపాల్ అంజలీదేవి తెలిపారు... విద్యార్థులు కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత మార్కులు సాధించి కాలేజ్‌కు మంచి పేరు తీసుకొచ్చారని, ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులను గౌసియా 487 ఫస్ట్ ర్యాంక్

బోయ శ్రావణి 478 సెకండ్ ర్యాంక్

డీకే లక్ష్మి.,,......478 సెకండ్ ర్యాంక్

సానియా...ఉ... 477 థర్డ్ ర్యాంక్

కాసింబి..........477 విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని అన్నారు... పేరెంట్స కల్లుబావిరాజు ప్రిన్సిపల్ మేడమ్ గారికి టీచర్స్ కు సన్మానం చేయడం జరిగింది

## జిల్లా ప్రజల ఆరోగ్యమే మా బాధ్యత

### మంత్రి టీ.జీ భరత్ గుప్తా - మంత్రి టీ.జీ భరత్ గుప్తా ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో......** రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రివర్యులు గౌ,, టీ.జీ. భరత్ గుప్తా సౌజన్యంతో మరియు గౌరి గోపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కర్నూలు నియోజకవర్గానికి చెందిన ప్రజలకు ఉచిత మెగా వైద్య శిభిరాన్ని ఏప్రిల్ 17 మరియు 18 తేదీలలో 2 రోజుల పాటు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు జిల్లా తెలుగుదెశంపార్టీ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు యాదవ్ కర్నూలు నగరంలోని గౌరి గోపాల్ హాస్పిటల్ నందు ఎర్పాటు చెసిన వైద్యశిభిరానికి ముఖ్యులుగా హాజరై వైద్య శిభిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గౌ,, టి.జి.భరత్ గుప్తా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ శిబిరంలో రక్తపరీక్షలు (=దీూ), ఈసీజీ (జుజ+), 2ణ ఎకో, టీఎంటీ (ఎమీ), ఫైబ్రో స్కాన్, కంటి పరీక్షలు, లివర్ పరీక్షలు వంటి అనేక వైద్య సేవలను ఉచితంగా అందించారు. కర్నూలు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై టి.జి.భరత్ గుప్తాకి నిరంతర శ్రద్ధ కొనసాగుతుందని, భవిష్యత్తులో వారు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

## మజ్జిగ వితరణ



**కొత్తపల్లి – నంది పత్రిక:** వేసవి ఎండలు తీవ్రతరం అయ్యాయి. దీంతో మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సమీపంలోని పొలిమేరలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జరుగుతన్నాయి. శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థుడు కుమ్మరి సంజీవ రాయుడు ఉపాధివేతన దారులకు ఎండతీవ్రతను తగ్గించేందుకు 360 మందికి మజ్జిగను వితరణ చేశారు. ఇదేవిధంగా దాతలు ముందుకు వచ్చి ఉపాధి కూలీలలకు చల్లిపానియాలు పంపిణీ చేయాలని కోరారు.

## శిరివెళ్లలో సమృద్ధిగా సాగునీరు ఆశాజనకంగా వరి సాగు

**భూమా కుటుంబం కృషితోనే సాగునీటి సాధన శ్రీకాంత్ రెడ్డి**

**ఎమ్మెల్యే హామీతో ధైర్యంగా వరి సాగు యామ గుర్రప్ప**

**అఖిలప్రియ పట్టుదలతో 10 వేల ఎకరాల్లో వరి శ్రీనివాస రెడ్డి**

**ఇంజనీర్లు సాధ్యం కాదన్నా నీరు తెచ్చిన అఖిలప్రియ శకుంతలమ్మ**

**నిరంతర సాగునీటితో పంటలు పుష్కలంగా రైతులు**



**శిరివెళ్ళ : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని మెట్ట సమీపంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు రైతులతో భేటీ నిర్వహించారు. ఈ ఏడాది మండలంలో సమృద్ధిగా సాగునీరు అందడంతో వరి సాగు ఆశాజనకంగా కొనసాగుతోంది. అధికారుల అభ్యంతరాలు , క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో తెలుగు గంగ , కేసీ కెనాల్ ద్వారా నిరంతరాయంగా నీటి సరఫరా కొనసాగడం ఈ సీజన్ ప్రత్యేకతగా నిలిచింది.

**దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.** ఈ సందర్భంగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ , మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ రైతాంగ సంక్షేమం కోసం భూమా కుటుంబం ఎప్పటి నుంచో కృషి చేస్తోందన్నారు. భూమా నాగిరెడ్డి , శోభా నాగిరెడ్డి సాగునీటి కోసం చేసిన పోరాటాలను గుర్తుచేస్తూ , ప్రస్తుత పరిస్థితుల్లోనూ అఖిలప్రియ అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఇటీవల అధికారులు నీటి విడుదల సాధ్యం కాదని చెప్పినా , ముఖ్యమంత్రి మరియు మంత్రులతో చర్చించి నీటి విడుదల సాధ్యమయ్యేలా చేసినందునే ప్రస్తుతం ఏప్రిల్ నెలలో కూడా సాగునీరు అందుతోందని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అలాగే మాజీ జెడ్పిటిసి యామ గుర్రప్ప మాట్లాడుతూ మండలంలో వరి సాగు మంచి స్థాయిలో సాగుతోందని , పంటలు కోతకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నంద్యాలలో జరిగిన నీటి సంఘాల సమావేశంలో అధికారులు సాగునీరు కష్టమని సూచించినప్పటికీ , ఎమ్మెల్యే హామీతో రైతులు ధైర్యంగా వరి సాగు చేపట్టారని చెప్పారు. మధ్యలో ఒకసారి నీటి కొరత వచ్చినా , వెంటనే స్పందించి నీటి విడుదల చేయించడంతో చివరి దశ వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు కొనసాగిందనీ యామ గురప్ప పేర్కొన్నారు. శిరివెళ్ల సొసైటీ చైర్మన్ కొండమగుడుల శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... డిసెంబర్‌లో జరిగిన సమావేశాల్లో నీటి విడుదల అసాధ్యమని అధికారులు పేర్కొన్నప్పటికీ , ఎమ్మెల్యే పట్టుదలతో ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించారని తెలిపారు. ఆమె చొరవతో సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగు జరిగి , ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని , రైతులకు మంచి ఆదాయం లభిస్తోందని వివరించారు. అదేవిధంగా సొసైటీ ద్వారా ఎరువుల సరఫరా కూడా సకాలంలో అందించ గలిగామని చెప్పారు.టీడీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ మాట్లాడుతూ... గతంలో కేసీ కెనాల్‌కు నీరు రాక రైతులు ఇబ్బందులు పడ్డారని , ఇంజనీర్లు సాధ్యం కాదని చెప్పినా ఎమ్మెల్యే అఖిలప్రియ స్వయంగా పర్యవేక్షణ చేసి నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. దీంతో పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని శకుంతలమ్మ తెలిపారు.రైతులు మాట్లాడుతూ... ఈ ఏడాది సాగునీరు ఎటువంటి అంతరాయం లేకుండా లభించిందని , పంటలు బాగా పండుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో సాగునీటి సమస్యలు పరిష్కరించబడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్యల వల్ల ఆళ్లగడ్డతో పాటు నంద్యాల తాలూకా రైతులకు కూడా లాభం చేకూరిందని చెప్పారు. గుంప్రమానుదీన్నె గ్రామ మాజీ సర్పంచ్ చిన్నస్వామి కూడా రైతులతో కలిసి ఎమ్మెల్యే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు మోహన్ రెడ్డి , డి. మురళి సంగిరెడ్డి నాగేశ్వర రెడ్డి , గంగ దాసర శ్రీనివాస రెడ్డి కమతం జయరామిరెడ్డి , కమతం పుల్లారెడ్డి , శేష ఓబుల్ రెడ్డి , చింతకుంట్ల బూసిరెడ్డి, బాల చంద్రుడు , ఫిదా హుస్సేన్ , లక్ష్మీ రెడ్డి , రవి చంద్రరెడ్డి, మహమ్మద్ హుస్సేన్ , యువ నాయకులు యూనుస్ , రఫీ ఇతర మండల కూటమి నాయకులు కార్యకర్తలు , నీటి సంఘ అధ్యక్షులు , మెంబర్లు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యసాధనకు కృషి చేయాలి“



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం: బ్యూరో చీఫ్ 17 ఏప్రిల్,నంది పత్రిక** ఫస్ట్ ఇయర్ ఇంటర్మీడియట్ సీఈసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థిని కొవ్వూరి సింధు భవితను అభినందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి. పెనుమంట్ర మండలం మార్టేరు వద్ద గ్రామానికి చెందిన సింధు భవిత ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీ విభాగంలో మొత్తం 500 మార్కులకు గాను 491 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం భీమవరంలోని తన కార్యాలయ చాంబర్‌లో కలెక్టర్ విద్యార్థినికి దుశ్శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఇంత ప్రతిభ కనబరిచినందుకు సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. తదుపరి ఉన్నత విద్యలపై కలెక్టర్ ప్రశ్నించగా, సింధు భవిత ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉన్నదని, దానికి అనుగుణంగా బి.ఏ. కోర్సును అభ్యసించాలని సంకల్పించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆమె శ్రీ వాసవి మహిళా కళాశాలలో విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొంది. విద్యార్థిని తన విద్యాభ్యాసంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు మరియు స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. వినయంతో, అంకితభావంతో ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధించగలదని హితవు పలికారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తండ్రి కె.శ్రీనివాసరెడ్డి, తల్లి వెంకట శ్రీదేవి తమ కుమార్తె సాధించిన విజయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ వృత్తిని లక్ష్యంగా ఎంచుకోవడం గర్వకారణమని తెలిపారు..



# మహిళా బిల్లు మోడీ ఎన్నికల జిమ్మిక్కు

## మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ప్రధాని నరేంద్ర మోడీ మహిళా బిల్లు ప్రవేశపెట్టడం ఎన్నికల జిమ్మిక్కు అని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత అభిప్రాయపడ్డారు. శుక్రవారం సాయంకాలం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుమలత మాట్లాడుతూ భారత దేశంలోనీ 5 రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నాయని, 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో ఓటును పోగేసుకునేందుకు మోడీ ఆడుతున్న మైండ్ గేమ్ అని ఏప్రిల్ 23వ తేదీన ఓవైపు పశ్చిమబెంగాల్ మరో వైపు తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో ఓట్లను రాబట్టేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును బూచిగా బిజెపి చూపుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోడీ భారత ప్రజలను మోసం చేస్తున్నారని, డిలిమిటేషన్ పేరుతో మహిళా చట్టాన్ని సాగదీసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. నారీ శక్తి వందన్ అది నియమ్ పేరుతో దేశ సమగ్రతపై అతి పెద్ద దాడిగా ఎన్డిఏ కుట్రలు పన్ను తుందని సుమలత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అక్తర్ బి, తహేరబి, ముంతాజ్, జాఫర్ బి, కర్రెమ్మ, నారాయణ, నాగన్న, కృష్ణ, పీటర్ మొదలగు వారు పాల్గొన్నారు.



# బొమ్మలు, విద్యా సామగ్రి ద్వారా చిన్నారులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన అందించాలి





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక** భీమవరం మండలం, రాయలం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలో ఉన్న చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్యం, విద్యా పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆ కేంద్రంలో 21 మంది చిన్నారులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు గుర్తించారు. చిన్నారులతో కొంతసేపు గడిపిన కలెక్టర్, వారికి ఆటల పరికరాల ద్వారా వస్తువులను గుర్తించే విధంగా ప్రదర్శనలు చేసి, అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఆయా తన కుమారుడు ప్రసాద్ జన్మదిన వేడుకలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నిర్వహించారు. చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించడంతో పాటు బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడి ఉపాధ్యాయురాలితో చిన్నారులకు అందిస్తున్న ఆహారపు పట్టిక, బోధన విధానాలు, శిక్షణ పద్ధతులపై వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులను సొంత పిల్లలుగా భావించి వారికి మంచి విద్య, నడవడిక అలవాటు అయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బొమ్మలు, విద్యా సామగ్రి ద్వారా చిన్నారులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన అందించాలని ఆదేశించారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్–1ను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, బోధన విధానం, చదువుతున్న తీరు పరిశీలించి, విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రమాణాలను అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, సిడిపిఓ లక్ష్మీకాంతం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, వీఆర్ఓ కె.శ్రీనివాస్, మాజీ వైస్ సర్పంచ్ దండు సోమరాజు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు..





# ప్రజా సంక్షేమమే లక్ష్యం:

## ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి



**నందిపత్రిక –డోన్** ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే తన ప్రథమ ప్రాధాన్యతని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే**

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే స్వయంగా వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం.అర్హులైన వారికి త్వరితగతిన పింఛన్లు అందేలా చూడాలని విన్నవించారు.లోవోల్టేజ్ సమస్యలు స్థానిక ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాల కల్పనపై వినతులు అందజేశారు.వచ్చిన ప్రతి వినతిని ఎమ్మెల్యే క్షుణ్ణంగాపరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను బట్టి అధికారులతో సమన్వయం చేసుకుని, తగిన చర్యలు తీసుకుంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు.నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా నన్ను సంప్రదించవచ్చు. ప్రతి సమస్యపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వలసల రామకృష్ణ,రాఘువేంద్ర గౌడ్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# భీమవరంలో మొట్టమొదటిసారిగా “ఎయిర్ హాట్ బెలూన్” (ఎయిర్ హాట్ బె లూన్ ) రైడ్ ప్రారంభం



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక** “ఎయిర్ హాట్ బెలూన్” రైడ్ ను రియోర్ట్ (రైడ్ రియట్ ) సంస్థ ఆధ్వర్యంలో, ఢిల్లీకి చెందిన అడ్వాన్ టిక్స్ (అడ్వెంటేక్స్ ) సంస్థ సమన్వయంతో డిఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడం జరిగింది. శుక్రవారం ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని బెలూన్ రైడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాలు, ప్రముఖ నగరాల్లో మాత్రమే కనిపించే హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ ఇప్పుడు భీమవరంలో అందుబాటులోకి రావడం ఆనందకరమని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, యువత మరియు కుటుంబాలు ఈ రైడ్‌ను సురక్షితంగా మరియు ఆనందంగా ఆస్వాదించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఒకేసారి ఆరు మంది వరకు ఈ బెలూన్‌లో ప్రయాణించి సుమారు 200 అడుగుల ఎత్తుకు ఎగరగలరని వివరించారు. ఈ రైడ్ కార్యక్రమం నాలుగు రోజుల పాటు, అంటే 17 ఏప్రిల్ నుండి 20 ఏప్రిల్ 2026 వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 5:30 నుండి 7:30 గంటల వరకు, అలాగే సాయంత్రం 7:30 నుండి 8:30 గంటల వరకు రైడ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కొక్కరికి రూ.1600/–లు రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ కార్యక్రమం ప్రజలకు ఒక వినూత్న అనుభవాన్ని అందిస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భీమవరం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అదనపు మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు, వ్యవసాయ సంయుక్త సంచాలకులు జెడ్.ఓవెంకటేశ్వర్లు, తహసిల్దార్ రావి రాంబాబు, నిర్వాహకులు విజయరామరాజు, తేజ, సాహిత్య, మౌనిక, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తలనొప్పి తెచ్చేలా రాహుల్ ప్రసంగం

## పార్లమెంట్‌ను హేళన చేసేలా ప్రవర్తన

## బిజెపి ఎంపి కంగనా రనౌత్ విమర్శలు

లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగం వినడం తలనొప్పిగా మారిందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాహుల్ ప్రసంగం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, అసలు విషయాలను రాహుల్ పక్కనపెట్టి తన వ్యక్తిగత విషయాలు, బాల్యం ముచ్చట్లు చెప్పడం తనకు తననొప్పి కలిగించిందని అన్నారు. ఆయన ప్రసంగం ఒక న్యూసెన్స్‌లా ఉందని, స్పీకర్ కూడా పార్లమెంటరీ ప్రమాణాలకు లోబడే మాట్లాడాలని రాహుల్‌కు చెప్పారని అన్నారు. రాహుల్ ప్రవర్తన పార్లమెంటును హేళన చేసేలా ఉందని కంగనా రనౌత్ విమర్శించారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో డీలిమిటేషన్ బిల్లుపై విమర్శలు గుప్పించారు. ఇందువల్ల మహిళా సాధికారతకు ఒరిగేదేమీ ఉండదన్నారు. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను మార్చే ప్రయత్నమే జరుగుతోందని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇది కులగణనను బైపాస్ చేసే ప్రయత్నమేనని చెప్పారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి




## బాల్యవివాహాలు చేసేవారిపై కేసులు నమోదు చేయాలి

## బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్న దేవాలయాలు, తదితర ప్రదేశాల వద్ద గట్టి నిఘా ఉంచాలి

## బాలికా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## బాల్య వివాహాలు నిర్మూలనపై అధికారులతో సమీక్షించి, గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...

**ఏలూరుబ్యూరో చీఫ్ , ఏప్రియల్ 17:నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం బాల్య వివాహాలు నిర్మూలనపై తీసుకోవలసిన చర్యలపై అధికారులతో సమీక్షించి, గోడపత్రికలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, నిర్మూలనకు సమాజం అంతా కలిసికట్టుగా పనిచేయ్యవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్యవివాహాలు బాలికలు ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాలికలకు విద్య అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళలు పురుషులతో దేంట్లోనూ తక్కువ కాదని, ఉన్నత విద్యావంతురాలైన తరవాత తన కాళ్లపై తాను నిలబడిన తరవాత వివాహం చేయాలన్నారు. 18 సంవత్సరాలు లోపు బాలికలకు, 21 సంవత్సరాలు లోపు బాలురకు వివాహం చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ గోడపత్రికలు ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన పెంపొందించి, బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. రాబోవు అక్షయ తృతీయ నాడు శుభకార్యాలకు చాలా శుభం జరుగునని మంచి లగ్నమని బాల్యవివాహాలు చేయడానికి అవకాశం ఎక్కువగా ఉందని వాటిని అరికట్టడానికి సంబంధిత శాఖలందరూ సమన్వయంతో నిశితంగా పరిశీలించి నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేకించి దేవాలయాల వద్ద దేవాలయాలుకి అనుబంధంగా ఉన్న కళ్యాణ మండపాలలోనూ ఏ విధమైన బాల్య వివాహము జరగకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీమతి వెట్రీ సెల్వీ ఆదేశించారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ యూనిట్ మరియు క్రాఫ్ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అక్షయ తృతీయ నాడు బాల్యవివాహాలు జరగకుండా నిరోధించాలని ప్రతి ఒక్కరూ వారి వారి శాఖల పరిధిలో గ్రామస్థాయిలో మరియు కమ్యూనిటీ లెవెల్ లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకించి 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, ఇంటర్ విద్యార్థులు పట్ల వారి నడవడికల పట్ల నిఘా ఉంచాలని గ్రామస్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు ,స్కూల్ టీచర్లు , గ్రామ వెల్ఫేర్ సెక్రెటరీ , మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు సమన్వయంతో పనిచేయాలని తెలియజేశారు . జిల్లాలోని అన్ని శాఖల వారు వారి గ్రామస్థాయి అధికారుల వరకు సరైన దిశా నిర్దేశం చేసి జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు లేదా ఎమర్జెన్సీ పోలీస్ నంబర్ 112 కు కాల్ చేసి వివరాలు తెలియజేయవచ్చున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ వారు ప్రతి గుడిలోనూ బాల్యవివాహాలను నిరోధించటం, బాల్య వివాహంలో పాల్గొన్న , జరిపించిన విధించే శిక్షలు గురించి అవగాహన కల్పించే పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. వివాహం కొరకు రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు వచ్చిన వెంటనే వధువు, వరుడు వయస్సు ధృవీకరణ సర్టిఫికెట్లకు స్కూల్ స్టడీ సర్టిఫికెట్ ని ప్రామాణికంగా తీసుకోవాలని ఆధార్ ప్రామాణికంగా తీసుకున్నప్పుడు వారి యొక్క స్కూల్ ఎన్రోల్మెంట్ డేట్ అఫ్ బర్త్ తో ధృవీకరించుకోవాలన్నారు. చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ పి శారద, డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి, డిఇఓ శ్రీమతి వెంకట లక్ష్మమ్మ , డీసీపీఓ సిహెచ్. సూర్యచక్రవేణి, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ యం.సుబ్బారావు; సిడిపిఓ లు పద్మావతి, రాజశేఖర్, దీప్తి నోడల్ ఆఫీసర్ తులసి ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మరియు ద్వారకాతిరుమల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, బ్రాహ్మణ ఐక్యవేదిక సభ్యులు మైలవరపు గురుశర్మ , వెంకటేశ్వర శాస్త్రి మరియు మ్యారేజ్ పెర్ఫార్మెన్స్ లైసెన్స్ హోల్డర్స్ నేతల రమేష్ బాబు , మ్యారేజ్ నిర్వహించు పాస్టర్స్, కాజాస్ - ముస్లిం మత పెద్దలు, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, డిసిపియు సిబ్బంది జయలక్ష్మి , రాజు, బాలస్వామి, రాజేష్, రాజకుమార్, మాధవి మరియు ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లుకు మద్దతు..వైసీపీ మహిళా నేతలు...



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 17 ( నంది పత్రిక )** నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంట్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రవేశపెట్టిన మహిళా బిల్లుకు వైసీపీ నంద్యాల జిల్లా మహిళా నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక వైసీపీ కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డా. శశికళారెడ్డి, రాష్ట్ర మాజీ దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, నంద్యాల అసెంబ్లీ అధ్యక్షురాలు హుసేనమ్మ, మాజీ కౌన్సిలర్ కన్నమ్మ మీడియా సమావేశం నిర్వహించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైసీపీ డా.శశికళారెడ్డి, సునీత మాట్లాడుతూ... నరేంద్రమోడీ ప్రభుత్వం పార్లమెంట్లో మహిళా బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సందర్భంలో మహిళలకు చట్టసభలో మరియు నామినేటెడ్ పదవుల్లో 50శాతం పైగా రిజర్వేషన్లను కల్పించారని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు. రాష్ట్రంలో కేబినెట్ పదవులో మహిళలకు ప్రాధాన్యత కల్పించారని డిప్యూటీ సీఎం, హోంశాఖ, వైద్యారోగ్యశాఖ, టూరిజం, ఇలా అనేక కీలక శాఖలను మహిళలకు కేటాయించడం జరిందన్నారు. అలాగే సంక్షేమ పథకాలో కూడా మహిళలకే ప్రాధాన్యత కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయానికి వైసీపీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలకు పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక** జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమం ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు సమాంతరంగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహించడం ద్వారా భూసంబంధిత సమస్యలకు సమర్థవంతమైన పరిష్కార మార్గం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన ఈ కార్యక్రమం కింద 2026 ఏప్రిల్ 13 వరకు మొత్తం 13 విడతలుగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ కాలంలో జిల్లాలో మొత్తం 553 దరఖాస్తులు అందగా, వాటిలో 189 దరఖాస్తులకు పరిష్కరించడం జరిగిందన్నారు. 85 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించబడగా, ఇంకా 279 దరఖాస్తులు పరిష్కారానికి పెండింగ్లో ఉన్నాయని వెల్లడించారు. డివిజన్ల వారీగా భీమవరం డివిజన్ లోని ఆకివీడు, భీమవరం, పాలకోడేరు, గణపవరం, కాళ్ల, ఉండి, వీరవాసరం మండలాల్లో మొత్తం 234 దరఖాస్తులు అందాయనీ, వీటిలో 83 దరఖాస్తులు పరిష్కరించబడి, 36 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని తెలిపారు. ఇంకా 115 దరఖాస్తులు పరిష్కారానికి మిగిలి ఉన్నాయన్నారు. నరసాపురం డివిజన్ లోని ఆచంట, పాలకొల్లు, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, మొగల్తూరు, యలమంచిలి, నరసాపురం మండలాల్లో మొత్తం 210 దరఖాస్తులు అందగా, వీటిలో 76 దరఖాస్తులు పరిష్కరించబడి, 36 తిరస్కరించబడ్డాయని, ఇంకా 98 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. తాడేపల్లిగూడెం డివిజన్ లోని అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఇరగవరం మండలాల్లో 109 దరఖాస్తులు అందగా, వాటిలో 30 దరఖాస్తులు పరిష్కరించబడి, 13 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని, ఇంకా 66 దరఖాస్తులు పరిష్కారానికి మిగిలి ఉన్నాయన్నారు. మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఫిర్యాదును పూర్తిగా పరిశీలించి, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలకు పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం లభిస్తున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలి







## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ ఏప్రిల్ 17, నంది పత్రిక** జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, డిఎంహెచ్ఓ డా.జి.గీతా బాయ్, డిఆర్డిఏ పీడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన దివ్యాంగుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో నేడు మొత్తం 15 అర్జీలు అందాయని తెలిపారు. ఈ అర్జీలలో ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు, వైద్య సహాయం, ఉపాధి అవకాశాలు, నెలకు 15,వేలు పెన్షన్ మంజూరు, బ్యాంకు రుణాల మంజూరు వంటి అంశాలపై వినతులు వచ్చినట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల నుండి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల స్వభావాన్ని అర్థం చేసుకుని త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగులు అర్జీలు సమర్పించేందుకు రావడానికి అనేక ఇబ్బందులు, ఖర్చులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అందువల్ల సేవాభావంతో స్పందించి త్వరిత పరిష్కారం అందించాలని సూచించారు. నిరుద్యోగ దివ్యాంగులు ఉద్యోగాల కోసం సమర్పించిన అర్జీలను దృష్టిలో ఉంచుకుని, వారికి ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించడం, తగిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా అర్హత మేరకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారి పి.లోకమాన్ ను ఆదేశించారు. అలాగే స్వయం ఉపాధి కోసం వ్యాపారాలు ప్రారంభించేందుకు రుణాలు మంజూరు చేయాలని వచ్చిన వినతుల మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన పిచ్చెట్టి ధనలక్ష్మి, ప్రస్తుతం ₹6,000 పెన్షన్ పొందుతున్నానని, 90% వికలాంగత్వంతో బాధపడుతున్నానని పేర్కొంటూ ₹15,000 పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన రెడ్డి రామకృష్ణ, చెవి వినికిడి సమస్యతో బాధపడుతున్నానని చెవి యంత్రం మంజూరు చేయాలని కోరారు. పెనుగొండ మండలం కొటాలపర్రు గ్రామానికి చెందిన ఎం.పవన్ కుమార్, తాను వెల్ఫేర్ అసిస్టెంట్గా పనిచేస్తున్నానని, అంగవైకల్యం కారణంగా జనాభా గణన విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తణుకు నివాసి బర్ల నాగలక్ష్మి, తన కుమార్తె పుట్టినప్పటి నుండి ఫిట్స్తో బాధపడుతూ మంచానికే పరిమితమైందని, సదరం సర్టిఫికెట్లో 75% వైకల్యం నమోదు అయిందని, దానిని రద్దు చేయాలని కోరారు. జిన్నూరు ప్రాంతానికి చెందిన కొత్త నాగ అనుసూయ దేవి, ప్రమాదవశాత్తు కాలు విరిగిపోవడంతో మంచానికి పరిమితమై, 90% వికలాంగ ధ్రువీకరణ పత్రం ఉన్నందున ₹15,000 పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, డీఎస్ఓ ఎన్.సరోజ, డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.అరుణ కుమారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జనగణన2027లో స్వీయ నమోదు విధానం కలెక్టర్ స్వయంగా నమోదు చేసి ప్రజలకు అవగాహన

## ఆన్లైన్లో కుటుంబ వివరాల నమోదు సౌకర్యం

## ఓటీపీ ధృవీకరణతో సులభమైన ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 17(నంది పత్రిక):-** జనగణన-2027లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ నమోదు (సెల్ఫ్ ఏనుమేరేషన్ ) విధానాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్వయంగా అధికారిక వెబ్సైట్ ద్వారా తన కుటుంబ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆన్లైన్ పోర్టల్ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ముందుగా పోర్టల్లో నమోదు చేసుకుని, మొబైల్ నంబర్కు వచ్చే ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలు, నివాస సమాచారం, విద్యా స్థాయి, ఉపాధి వంటి అంశాలను ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఒక కుటుంబానికి ఒక మొబైల్ నంబర్ మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నమోదు పూర్తిచేసే ముందు "ప్రివ్యూ " ఆప్షన్ ద్వారా వివరాలను పరిశీలించి, అనంతరం "ఫైనల్ సబ్మిట్" చేయాలని తెలిపారు. నమోదు పూర్తైన వెంటనే 11 అంకెల ప్రత్యేక ఎస్ ఈ ఐడి ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్తు అవసరాల కోసం దానిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు లేదా స్వయంగా నమోదు చేయలేని వారికి ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# స్వీయ జనగణనలో వివరాలను నమోదు చేసిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక** రాష్ట్రంలో ఏప్రిల్ 16, 2026 నుండి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తన కుటుంబానికి సంబంధించిన వివరాలను అధికారిక ఆన్లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్ హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం నుండి ఆన్లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నరసాపురం ఆర్డీవో శ్రీ దాసురాజు మంత్రికి స్వీయ జనగణన విధానం, నమోదు ప్రక్రియ మరియు దాని ప్రాముఖ్యతపై సమగ్రంగా వివరించారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ స్వీయ నమోదు ప్రక్రియను ప్రభుత్వం రూపొందించిన అధికారిక వెబ్సైట్ ద్వారా ప్రజలు సులభంగా పూర్తి చేసుకునేలా సౌకర్యం కల్పించబడింది. ప్రజలకు ఏప్రిల్ 30, 2026 వరకు తమ ఇళ్లకు సంబంధించిన వివరాలను స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. అనంతరం మే 1 నుండి మే 30, 2026 వరకు ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా గణన ప్రక్రియను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సమానంగా సంక్షేమం మరియు అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కుటుంబాన్ని ప్రాథమిక యూనిట్గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు ఖచ్చితమైన గణాంకాలు అత్యవసరమని, ఈ దిశగా జనగణన కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్లో తొలిసారిగా ఈ స్థాయి జనగణన కార్యక్రమం నిర్వహించబడుతోందని మంత్రి తెలిపారు. జనగణన ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని, ప్రస్తుతం ప్రారంభమైన మొదటి దశలో ఇళ్ల గణన జరుగుతుండగా, వచ్చే ఏడాది ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా గణన చేపడతామని వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ దశలో ప్రజలు స్వయంగా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సరైన మరియు ఖచ్చితమైన వివరాలను నమోదు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నరసాపురం ఆర్డీవో దాసిరాజు మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి, టిపిఓ, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జలధార కార్యక్రమంతో భూగర్భ జలాల పెంపు లక్ష్యం

**నీటి వనరుల సమర్ధ వినియోగంపై కలెక్టర్ దిశానిర్దేశం**

**జిల్లాలో నీటి సంక్షోభ నివారణకు ప్రత్యేక చర్యలు**

**మండలాల వారీగా జలవనరుల సమగ్ర గణాంకాల సేకరణ**

**కాస్కేడ్ సిస్టమ్‌తో చెరువుల అనుసంధానం**

**డోన్, ప్యాపిలి మండలాల్లో నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి**

**గ్రామ స్థాయిలో జల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 17(నంది పత్రిక):-** జిల్లాలో 100 రోజుల 'జలధార' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు సమిష్టిగా అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన 'జలధార' కార్యక్రమానికి సంబంధించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు సంబంధిత శాఖల అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సమర్థ వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యల నివారణ లక్ష్యాలుగా తీసుకుని100 రోజుల 'జలధార' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అధికారి తమ పరిధిలో ప్రణాళికాబద్ధంగా పని చేసి స్పష్టమైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. జిల్లాలోని 30 మండలాల్లో 11 మండలాలు నీటి నిల్వ విషయంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వర్షాల అనంతరం భూగర్భ జలాల మట్టం 3 మీటర్ల లోపల, వర్షాలకు ముందు 8 మీటర్ల లోపల ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి ఆ మేరకు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. కృష్ణా నది జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్, తెలుగు గంగ, కెనాల్, కేసీ కెనాల్‌లుగా విభజించి సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. అయితే డోన్ మండలంలోని కొచ్చెరువు ప్రాంతంలో భూగర్భ జలాలు సుమారు 45 మీటర్ల లోతులో ఉన్నాయని, జిల్లాలోని 165 గ్రామాల్లో నీటి మట్టం 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులోకి పడిపోయిందని చెప్పారు. డోన్, ప్యాపిలి మండలాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉందని తెలిపారు. ప్రతి మండలానికి సంబంధించిన భూగర్భ జలాల గణాంకాలను సిద్ధం చేయాలని, గ్రామ మరియు మండలాల వారీగా నీటి మట్టం వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు, కుంటలు తదితర నీటి వనరులపై పూర్తి వివరాలతో నివేదిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 330 మైనర్ ఇరిగేషన్ చెరువుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని చెప్పారు. నీటి వనరులు నిండే విధానాలపై అవగాహన కల్పిస్తూ, వర్షపాతం, మేజర్ కెనాల్స్ ద్వారా నీటి మళ్లింపు, సహజ ప్రవాహాల ద్వారా నీటి చేరిక వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని చెరువులు నిండడం కొన్ని కెనాల్స్ ద్వారా, మరికొన్ని సహజ ప్రవాహాల ద్వారా, మిగిలినవి పూర్తిగా వర్షాలపై ఆధారపడుతున్నాయని పేర్కొన్నారు. కాస్కేడ్ సిస్టమ్' ప్రాముఖ్యతను వివరిస్తూ, ఒక చెరువు నిండిన తరువాత అదనపు నీరు వరుసగా ఇతర చెరువులకు చేరే విధానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 27 కాస్కేడ్లలో మొత్తం 86 ట్యాంకులు ఉన్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం ఫామ్ పాండ్స్, చెక్ డ్యామ్స్, రాక్ ఫిల్ డ్యామ్స్, కాంటూర్ ట్రెంచెస్ వంటి నిర్మాణాలను గుర్తించి, వాటి స్థితిగతులను అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో భూగర్భ జలాల మట్టం, మండల సగటు, ప్రస్తుత నీటి వనరుల నిర్మాణాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చెరువుల స్థితి, ఫీడర్ ఛానల్స్ పరిస్థితి, సహజ నీటి ప్రవాహాలపై పరిశీలన జరిపి చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని, ఎండకాలంలో కూడా నీటి నిల్వ ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా భౌగోళికంగా కృష్ణా, పెన్నా బేసిన్లలో విస్తరించి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో సుమారు 75% కృష్ణా బేసిన్‌లో, 25% పెన్నా బేసిన్‌లో ఉందన్నారు. తుంగభద్ర బేసిన్ కృష్ణా పరిధిలో భాగం కాగా, నందికొట్కూరు తుంగభద్రలో, ఆళ్లగడ్డ పెన్నా బేసిన్‌లోకి వస్తాయన్నారు. పెన్నా బేసిన్‌లో కుందేరు నది ముఖ్య ఉపబేసిన్ అని, జిల్లాలో నీటి నిల్వల కొరత వల్ల వరదనీరు వృథాగా ఇతర జిల్లాలకు వెళ్లుతోందని కలెక్టర్ వివరించారు. ఈ వర్క్ షాప్ లో జల వనరుల శాఖ ఎస్ఈ శివశంకర్ రెడ్డి, భూగర్భ జల అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జొన్నలకు మద్దతు ధర రైతులకు ప్రభుత్వం భరోసా

**జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.**





**వెలుగోడు, ఏప్రిల్ 17 (నంది పత్రిక):** వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామంలో రైతు సేవా కేంద్రం సివిల్ సప్లైస్ మరియు డిసిఎంఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పండించిన పంటలకు సరైన ధర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జొన్నలను క్వింటాకు రూ.3,699 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ ఆసరా రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. మధ్యవర్తుల సమస్యలు లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పంటను తెచ్చి విక్రయించే అవకాశం ఉందని వివరించారు. అలాగే, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న జొన్నలను కొనుగోలు జరుగుతుందని అధికారులు తెలిపారు. పంటలో తేమ శాతం, శుభ్రత పాటిస్తే కొనుగోలు ప్రక్రియ సులభంగా ఉంటుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలనీ రైతు సేవా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసి, రైతులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వంగాల కృష్ణారెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ఆశ్వద్ నారాయణ నాయక్, ఎంఏఓ స్వాతి, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ నవీన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రతి నిర్జీవ జననాన్ని ఆసుపత్రి స్థాయిలో/ గ్రామస్థాయిలో గాని కచ్చితంగా నమోదు చేయాలి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈరోజు నిర్జీవ జననాల పర్యవేక్షణ మరియు నివేదికపై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. వై. కామేశ్వర్ ప్రసాద్ పర్యవేక్షణలో సమావేశం జరిగినది. జిల్లాలో జరిగే ప్రతి నిర్జీవ జననాన్ని ఆసుపత్రి స్థాయిలో/ గ్రామస్థాయిలో గాని కచ్చితంగా నమోదు చేయాలని, ఇది అధికారికంగా నమోదు కావాలన్నారు. జరిగిన ప్రతి నిర్జీవ జననం పై లోతైన దర్యాప్తు చేసి అనుభవిజ్ఞులైన గైనకాలజిస్టు మరియు పీడియాట్రీష న్ లతో విశ్లేషణ చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరణాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలపై సమాజంలో సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈరోజు జనవరి నెలలో జరిగిన నిర్జీవ జననంపై పూర్తిస్థాయి విచారణ జరిగింది. కార్యక్రమంలో ఆదోని డిప్యూటీ డి.ఎం. అండ్ హెచ్. ఓ. డా. ఎం. వి. సత్యవతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గర్భవతుల్లో రక్తహీనత ఎక్కువగా ఉండటం వల్లే మాతా శిశు మరణాలు, నిర్జీవ జననాలు జరుగుతున్నాయని జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య వసతుల్లో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉండేటట్టు చూడాలన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. జఫరుల్లా పీడియాట్రిక్ ప్రొఫెసర్ డా. ప్రకాష్ , గైనకాలజిస్ట్ డా. సావిత్రి , అనస్తీసియా ప్రొఫెసర్ డా. మురళీ ప్రభాకర్ , బ్లడ్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ డా. షేక్ షహనాజ్ , 104 నోడల్ ఆఫీసర్ నవీన్ , హెచ్ ఈ ఈ ఓ .బాబా ఫక్రుద్దీన్ , డిప్యూటీ డెమో . షఫీ ఉన్నిసా , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ . అన్నపూర్ణ పాల్గొన్నారు.

# కార్మికహక్కులు కాలరాస్తున్న మోడీ





**ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు, కనీస వేతనాలు కోసం పోరాటాలు**

**26న చలో తిరుపతి గోడపత్రిక విడుదల**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో .....** ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను సంస్కరణల పేరుతో మోడీ ప్రభుత్వం హక్కులు కాలరాస్తే చూస్తూ ఊరుకోమని హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ మునెప్పు హెచ్చరించారు. శుక్రవారం నాడు ఇంద్రజిత్ గుప్తా భవన్ ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం నందు తిరుపతిలో జరిగే 18వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ మునెప్పు మాట్లాడుతూ స్వాతంత్ర రాకముందే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న ఉద్యోగ భద్రత ,ఎనిమిది గంటల పని విధానం సాధించుకుంటే నేడు మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడం కార్మిక హక్కులకు వ్యతిరేకమని విమర్శించారు. పరిశ్రమల్లో యూనియన్ ఏర్పాటు చేసుకొని పనికి తగ్గ వేతనాలు పెంచాలని యాజమాన్యంతో చర్చించి నిర్ణయించుకుంటే హక్కును పూర్తిగా రద్దు చేయడం యాజమాన్యాలకు అనుమతితో కార్మిక సంఘాలు ఏర్పాటు అనే నిర్ణయం పూర్తి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఈ విధానాలు ఉపయోగపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోర్స్ వల్ల తీవ్ర నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఢిల్లీకి దగ్గరలో ఉన్న నోయిడాలో కార్మికులు రోడ్డుకెక్కి ఉద్యమాలు చేస్తున్నప్పటికీ వారికి అనుకూలంగా ప్రభుత్వాలు వివరిస్తూ కార్మికుల నాయకులని అక్రమ అరెస్టు చేయడం, యాజమాన్యాలకు రాజ్యం అండగా నిలవడం దీన్నిబట్టి కార్మిక హక్కులు పూర్తిస్థాయిలో నష్టపోతున్నారని ఆరోపించారు. 8 గంటల పని విధానం కోసం జరిగిన పోరాటమే మేడే అమెరికా చికాగో నగరంలో యాజమాన్యాలు కార్మికులను 16 నుంచి 20 గంటల పనిచేస్తూ శ్రమ దోపిడీ చేస్తున్న నేపథ్యంలో కార్మికుల తిరుగుబాటు చేస్తే యాజమాన్యాల ఏకపక్ష నిర్ణయంతో పోలీసులు కాల్పులు జరిపారని అనేకమంది మరణించి ఆ రక్తంతో తడిచిన గుడ్డ నేడు ఎర్రజెండగా ప్రకటించి ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకున్నారని, అలాంటి పోరాటాల ద్వారా సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎనిమిది నుంచి 12 గంటల పని విధానం పెంచడం శ్రమ దోపిడీ చేయడమే విమర్శించారు. గతంలో సమ్మె చేయాలంటే 15 రోజులు ముందే యాజమాన్యాలకు నోటీసు ఇచ్చి సమ్మె చేసే వారిని కానీ నేడు 60 రోజులు టైం ఇచ్చి ఒకసారి చర్చ పిలిసి సమస్య పరిష్కారం కాకపోతే మరో 60 రోజులు ఎలాంటి సమ్మె చేయకూడదని నిబంధన పెట్టడం యాజమాన్యాలకు ఉపయోగపడడమే అని దీన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఆశ అంగడి వాడి కార్మికులకు నెలకు 26,000 కనీస వేతనాలు ఇవ్వాలని తీర్పు ఇచ్చినప్పటికీ అంగన్వాడి లకు 12000 ఆశా వర్కర్లకు 10,000 ఇవ్వడం వారి జీవితాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆ జీతాలతో జీవనం కొనసాగించడం సాధ్యం కాదని ప్రజా ప్రతినిధులు ఆ జీతాలతో ఒక నెల జీవనం కొనసాగిస్తే వాళ్లకు అర్థమవుతాదని తెలిపారు. బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డుని పున ప్రారంభించిన నిధులు కేటాయించకపోవడం దాదాపు 47 వేల క్లెయిమ్స్ పెండింగ్ లో ఉన్నాయని వాటిని అమలు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు

**తిరుపతిలో 26న భారీ ప్రదర్శన బహిరంగ సభ**

ఏఐటీయూసీ 18వ రాష్ట్ర మహాసభలు ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు తిరుపతి నగరంలో నిర్వహిస్తున్నట్లు 26వ తేదీన వేలాది మంది కార్మికులతో భారీ ప్రదర్శన బహిరంగ సభ, 27, 28 తేదీల్లో 1000 మంది ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు ఈ సభలకు ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు భారీ ప్రదర్శన బహిరంగ సభకు కర్నూలు జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్మికుల హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ కృష్ణయ్య , యన్ .లెనిన్ బాబు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన జిల్లాలో నూతన పరిశ్రమ లేక నిరుద్యోగం పెరుగుతుందని కేవలం అమరావతి పోలవరం పేరుతో ఆ ప్రాంతాల అభివృద్ధి చేస్తే రాయలసీమ జిల్లాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ప్రభుత్వం అన్ని ప్రాంతాల నూతన పరిశ్రమల ఏర్పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో జరిగే భారీ ప్రదర్శన బహిరంగ సభకు కర్నూలు జిల్లా నుంచి 500 మంది కార్మికులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎన్. మనోహర్ మాణిక్యం, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు జి చంద్రశేఖర్,ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ ఈశ్వర్, డిప్యూటీ కార్యదర్శి గణేష్ ,నాగరాజు హోటల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి రామాంజనేయులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రెహిమాన్, నల్లన్న, రేణుక, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబూలాల్, ఎల్లప్ప జయరాముడు ప్రభుత్వ హాస్పిటల్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రణీత్, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రజలకు కృతజ్ఞుడిని

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**బదిలీలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు**

**ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం మరువలేనిది**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** కర్నూలు రూపురేఖలు మార్చాలనే నా సంకల్ప ప్రయత్నానికి నగర ప్రజలు అందించిన సహకారం ఎన్నటికి మరువలేదని, ప్రజల పట్ల ఎప్పటికి కృతజ్ఞుడిని అని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం పాత కంట్రోల్ రూం వద్దనున్న కమిషనర్ క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 9 నెలల్లో స్వచ్ఛత, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పన, సంస్కరణలతో పాటు 'కర్నూలుకు హరితహారం', గార్బేజ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రివేళ పారిశుద్ధ్య పనులు, అవగాహన కార్యక్రమాలు, ఎల్ఆర్ఎస్, బిపియస్ అమలు, పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్, ఓపెన్ ఫోరం వంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు విస్తరణ, రహదారులు-డ్రైనేజీ నిర్మాణాలు, జెసిబిలతో పిచ్చి మొక్కల తొలగింపు, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు, ఈట్ స్ట్రీట్లు, వెండర్ జోన్లు, డాగ్ షెల్టర్ ఏర్పాటు, టిడ్కో గృహాల మరమ్మత్తులు, తాగునీటి పైప్లైన్ లీకేజీ సమస్య పరిష్కారం వంటి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఇందులో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు అందించిన సహకారం అద్వితీయమైనది కొనియాడారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు విద్యార్థులు, విద్యా సంస్థలు అందించిన సహకారం, వారి బాధ్యత అభినందనీయం అన్నారు. తాను వ్యక్తిగత కారణాల వల్ల ప్రభుత్వానికి పెట్టుకున్న అభ్యర్థన మేరకు బదిలీ జరిగిందని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఏమాత్రం లేదన్నారు. తమకు ప్రజాప్రతినిధులు అందించిన సహకారం వల్లే ఎన్నో వినూత్న కార్యక్రమాలు అమలు చేయగలిగామన్నారు. మున్ముందు సైతం కార్పొరేషన్‌కి ప్రజలు సహకారం అందించాలని, భవిష్యత్తులో కర్నూలుకు జాతీయ స్థాయిలో మంచి వస్తుందని విశ్వనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి విమానాశ్రయాల పరిసరాల్లో భవన నిర్మాణాలపై ఉన్న ఆంక్షలను సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012లో మార్పులు చేస్తూ జీవోఎంఎస్ నంబర్ 168 ద్వారా సవరణలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ విమానాశ్రయాల పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ నాయిస్ జోన్ నిబంధనలలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. ÷మానాల రాకపోకల వల్ల కలిగే శబ్ద కాలుష్యం దృష్ట్యా, గతంలో నిర్మాణాలపై కఠినమైన నియంత్రణలు ఉండేవి. అయితే, మారుతున్న పట్టణాభివృద్ధి అవసరాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. నాయిస్ జోన్ ప్రభావిత ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం ఇప్పుడు మరింత స్పష్టతనిచ్చింది. నాయిస్ జోన్ కిందకు వచ్చే ప్రాంతాల్లో భవనాల ఎత్తు, రకానికి సంబంధించి గతంలో ఉన్న కొన్ని అడ్డంకులను తొలగించారు. విమానాల శబ్దం వల్ల నివాసితులకు ఇబ్బంది కలగకుండా, భవన నిర్మాణంలో ధ్వని నిరోధక ప్రమాణాలను పాటించడాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, రియల్ ఎస్టేట్ వృద్ధికి ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి భవనాలు నిర్మించవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ ఉత్తర్వుల వల్ల ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ప్రాంతాల్లో భూముల విలువ పెరగడంతో పాటు, నిర్మాణ రంగంలో పారదర్శకత పెరుగుతుంది. నిబంధనల్లో స్పష్టత రావడం వల్ల మున్సిపల్ అధికారుల వద్ద ప్లాన్ అప్రూవల్స్ త్వరగా పొందే అవకాశం ఉంది. గతంలో నాయిస్ జోన్ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యేవి. తాజా సవరణలతో ఆ సమస్యలు తొలగిపోనున్నాయి. శంషాబాద్, పరిసర ప్రాంతాల్లో కొత్త వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఈ జీవో మార్గం సుగమం చేస్తుంది. విమానాశ్రయ పరిసరాల నియంత్రణ, పౌర భద్రతను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# శిథిలావస్థలో భవనాలు..

**భయం గుప్పెట్లో సిబ్బంది**



**నంద్యాల రూరల్, ఏప్రిల్ 17(నంది పత్రిక):-** నిత్యం వందలాది మంది ఉద్యోగులు, ప్రజలతో కళకళలాడే తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని ట్రెజరీ కార్యాలయం ప్రమాదకరంగా మారింది. భవనం శిథిలావస్థకు చేరుకోవ దంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎప్పుడు ఏం జరుగుతుందోనని వివిధ పనుల మీద ట్రెజరీ కార్యాలయానికి వచ్చే ప్రజలు, అక్కడ పని చేసే సిబ్బంది భయపడుతున్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణం ఆకులు, వ్యర్థాలతో నిండిపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## అంగన్వాడి సేవలు భేష్...

### టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఆన్సర్ భాష.



**చాగలమర్రి ప్రతినిధి ఏప్రిల్ 17 నంది పత్రిక** మాతా శిశు సంరక్షణలో అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం, వైద్య ఆరోగ్య విషయాల ద్వారా గర్భవతులు బాలింతలకు, చిన్నపిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఇచ్చే సలహాలు, సేవలు భేష్ అని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ తేజేశ్వరి ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ ఆన్సర్ భాష అభినందించారు. శుక్రవారం చాగలమర్రిలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 9వ రోజు పనికిరాని స్థానిక వస్తువులతో పూర్వ ప్రాథమిక విద్యార్థులకు అవసరమయ్యే విధంగా బొమ్మలు తయారు చేయుట గురించి పురుషులకు సూపర్వైజర్ సుశీల ఆధ్వర్యంలో నిర్వహించారు. పురుషులకు బొమ్మలను తయారు చేయు పద్ధతులు తెలియజేస్తూ అవగాహన కల్పించారు. బొమ్మల తయారీలో పురుషులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, మౌలాలి, ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ , అంగన్వాడి టీచర్లు, అంగన్వాడి సహాయకులు, అంగన్వాడి కేంద్రాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి - పిఆర్టియు...



**చాగలమర్రి ప్రతినిధి :ఏప్రిల్ 17 నంది పత్రిక** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి పిఆర్టియు ఆధ్వర్యంలో ఈనెల 21న కలెక్టరేట్ వద్ద 25న విజయవాడ ధర్నా చౌక వద్ద జరిగే ధర్నాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పి ర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు భాష జిల్లా కౌన్సిలర్లు నారాయణమూర్తి, రవి ప్రకాష్ రెడ్డి కోరారు. శుక్రవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్య గారిచే ధర్నాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొరుసు దస్తగిరి, శ్రీనివాసులు,వెంకటేశ్వర్ రెడ్డి,సూరిబాబు, జయన్న,మోహన్ రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రకు ప్రత్యేక అధికారులు

**బనగానపల్లె ఏప్రిల్ 17 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వము పచ్చదనము పారిశుధ్యం పై చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం జరిగినట్లు ఎంపీడీవో నాగరాజు శుక్రవారం తెలిపారు ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుండి ప్రత్యేక ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. బనగానపల్లె మండల పరిధిలో 24 గ్రామపంచాయతీలకు గాను 24 మంది ప్రత్యేక అధికారుల నియామకం జరిగినట్లు తెలిపారు. వీరంతా ప్రతి మూడవ శనివారము గ్రామపంచాయతీలకు వెళ్లి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని తెలిపారు.

## మాత శిశు సంరక్షణకు సమిష్టి సహకారం అవసరం... సి డి పి ఓ. తేజేశ్వరి..



**చాగలమర్రి ప్రతినిధిఏప్రిల్ 17 నంది పత్రిక** అంగన్వాడి కేంద్రాల పరిధిలో మాతా శిశు సంరక్షణకు అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, లబ్ధిదారుల సమిష్టి సహకారం అవసరమని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకము ఆళ్లగడ్డ ప్రాజెక్ట్ అధికారిని తేజేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె అంగన్వాడి టీచర్లు ఏర్పాటుచేసిన వివిధ రకాల ప్రీ స్కూల్ పిల్లల బొమ్మలను, పరిశీలించారు. పురుషులకు కూడా అవగాహన కల్పించారు. ఈమె వెంట చాగలమర్రి మండల సూపర్వైజర్ సుశీల, అంగన్వాడి టీచర్లు, అంగన్వాడి సహాయకులు, అంగన్వాడి కేంద్రాలలోని లబ్ధిదారులు ఉన్నారు.

## శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ



**బనగానపల్లె ఏప్రిల్ 17నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.కార్యక్రమం లో

ఆలయ సిబ్బంది, పూజారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కుళాయి తిప్పి నీరు త్రాగి మళ్లీ బంద్ చేసిన వానరం

### -నీరు వృధా కాకూడదనే వానరం తపన మానవాళికి ఆదర్శం..

### వానరం కున్న ఆలోచన మనుషులకు లేదా..



**మంత్రాలయం, ఏప్రిల్ 17,(మనం న్యూస్) :** ఎండల తీవ్రతకు మనుషులే కాదు జంతువులు, పక్షులు కూడా నీటి దాహంతో తహతహలాడుతాయి. శుక్రవారం నీటి దాహంతో ఒక వానరం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఒక ఇంటి బయట ఉన్న నీటి కొళాయిని చేత్తో తిప్పుకొని నీరు త్రాగి దాహం తీర్చుకుంది. మళ్లీ కుళాయిని తిప్పి నీరు వృధా కాకుండా బందు చేసిన దృశ్యం కనిపించింది. నీటిని వృధా చేయకుండా నీటి సంరక్షణ ఎంతో ముఖ్యమని భావించిన వానరం మనుషులకు ఆదర్శంగా నిలిచింది. వానరం నుంచే మనిషి వచ్చాడని చరిత్ర చెబుతున్నప్పటికీ వానరంకున్న ఆలోచన మనుషులకు లేక.. నీటిని వృధా చేసి అదే నీరు లేని సమయంలో ఆరాట పడడం రివాజుగా మారింది. వర్షా కాలంలో కురిసిన వానలకు జలాశయాలు కళ కళ లాడుతున్నప్పటికీ నీటి నిల్వ భవిష్యత్తుకు అవసరం అనే ఆలోచన లేక వృధాగా సముద్రంలోకి వదలేస్తున్నారు. నీటి నిల్వలు అవసరమని ప్రతి ఒక్కరూ భావించాలి. ఇప్పటికైనా వానరాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక** జిల్లాలోని భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు ఆర్థిక సహాయ పథకాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఈ పథకాల ద్వారా కార్మికుల జీవనోపాధి మెరుగుపడటంతో పాటు, కుటుంబ భద్రతకు కూడా బలపడుతుందని పేర్కొన్నారు. ప్రసూతి సహాయంగాలి మహిళా కార్మికురాలు లేదా ఆమె కుమార్తెకు, అలాగే కార్మికుడి భార్య లేదా కుమార్తెలకు ప్రతి ఒక్కరికి గరిష్టంగా రెండు కాన్పుల వరకు రూ. 20,000 చొప్పున ఆర్థిక సహాయం అందించబడుతుంది. వివాహ కానుకగా మహిళా కార్మికురాలు లేదా కార్మికుడి కుమార్తె వివాహానికి రూ. 20,000 అందించబడుతుంది.సహజ మరణం సహాయంగాలి కార్మికుడి సహజ మరణం సంభవించిన పక్షంలో కుటుంబానికి రూ. 60,000 ఆర్థిక సహాయం అందించబడుతుంది. మరణాంతర ఖర్చులుగా కార్మికుడి అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. 20,000 ఇవ్వబడుతుంది జిల్లాలోని అన్ని నిర్మాణ రంగ కార్మికులు తమకు సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాలను వెంటనే సంప్రదించి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇంకా సంక్షేమ బోర్డులో నమోదు కాని కార్మికులు తక్షణమే నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు తమ నమోదు పునరుద్ధరణ (రెన్యువల్) కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా, రాబోయే మేడే కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించబడే అవార్డుల ప్రధానోత్సవానికి సంబంధించి శ్రమ శక్తి అవార్డులు మరియు ఉత్తమ యాజమాన్యం అవార్డులు కోసం అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు వెంటనే కార్మిక శాఖ కార్యాలయానికి పంపాలని కోరారు. ఏవైనా సందేహాలు లేదా సమాచారం కోసం భీమవరం, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లోని కార్మిక శాఖ అధికారులను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## జిల్లాలో స్వామిత్వ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల సర్వేయర్లతో స్వామిత్వ, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యు ఎఫ్ ఎస్ ), ఈ-కేవైసీ అంశాలపై మండలాల వారీగా ప్రగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా పూర్తి చేయాల్సిన స్వామిత్వ సర్వే పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రేపటి నుండి సర్వే ప్రగతిపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తానని, మండల అభివృద్ధి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలాలకు కేటాయించిన సర్వేయర్లు రేపు ఉదయం 8 గంటలకు సంబంధిత ఎంపీడీవోల వద్ద హాజరై పనులను ప్రారంభించాలని తెలిపారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అదేవిధంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే మరియు ఈ-కేవైసీ ప్రగతిపై కూడా సమీక్షించి, నూరు శాతం లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై. దోసి రెడ్డి, జిల్లాలోని తహసిల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

## వైయస్సార్ పార్టీ నంద్యాల జిల్లా విభాగం లో బనగానపల్లె యువతకు పదవులు



**బనగానపల్లె ఏప్రిల్ 17నందిపత్రిక** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైయస్సార్ పార్టీ అధిష్టానం నియోజకవర్గాల పై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో బనగానపల్లె నియెజకవర్గం లోని ముఖ్యనేత సూచన మేరకు యువతకు పార్టీలో పదవులు కట్టబెట్టారు. నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ పదవుల్లో బనగానపల్లె నియోజకవర్గానికి పెద్ద పీట వేశారు.శుక్రవారం పార్టీలో పదవులు చేపట్టిన వారంతా బనగానపల్లె ముఖ్య నేత మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.పదవులు చేపట్టిన వారిలో కోవెలకుంట్ల నుండి ధనికొండ నాగేశ్వర్ రెడ్డి నంద్యాల జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గా, బనగానపల్లె మండలం పలుకురు గ్రామానికి చెందిన కొట్టాల వెంకటేశ్వర్లు యువజన విభాగం కార్యదర్శిగా,అవుకు పట్టణానికి చెందిన కునుకుంట్ల హరి, బనగానపల్లె మండలం చెరువుపల్లె గ్రామానికి చెందిన గొరుగంటి అదానీ బాషా ను జిల్లా వైఎస్ఆర్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పార్టీ ఎన్నిక చేసింది ఈ సందర్భంగా వారు అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి,బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి, పదవి రావడానికి సహకరించిన జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ మాజీ శాసన సభ్యులు రామిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీవీ నాగార్జున రెడ్డి,అంబటి రవిరెడ్డి, చిక్కెపల్లి ప్రసాద్ రెడ్డి, సింగారెడ్డి రాంభూపాల్ రెడ్డి,చెరువుపల్లె పుల్లయ్య, అక్బర్ బాషా,రామసుబ్బయ్య గౌడ్, దశరథ రెడ్డి,వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## చికిత్స పొందుతూ కోలుకోలేక తేజస్విని మృతి



**మంత్రాలయం , ఏప్రిల్ 17, మనం న్యూస్ :-** మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోన గ్రామ సమీపంలో గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందగా , మరో 13 మందికి తీవ్ర గాయాలైన విషయం విధితమే . మెరుగైన వైద్యం కోసం వారిని కర్నూలు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం తేజస్విని చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. తేజస్విని మృతదేహాన్ని పోస్టుమార్టం చెసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు

## రేపు (శనివారం) అన్ని గ్రామ పంచాయతీల్లోనూ, మున్సిపాలిటీల్లోనూ స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు, నంది పత్రిక బ్యూరో...**రేపు (శనివారం) అన్ని గ్రామ పంచాయతీల్లోనూ, మున్సిపాలిటీల్లోనూ స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్ లను, డిపిఓ ను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ గారు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర (స్వాస్వా) కార్యక్రమం పై కలెక్టర్ లతో, మున్సిపల్ కమిషనర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేపు (శనివారం) అన్ని గ్రామ పంచాయతీల్లోనూ, మున్సిపాలిటీల్లోనూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా "జలధార - జలహారతి" అనే థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా నీటి వనరుల శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. కుంటలు, చెరువులు వంటి నీటి వనరులతో పాటు, చెత్తాచెదారం పేరుకుపోయిన సమస్యాత్మక ప్రాంతాలను శుభ్రం చేయించాలని కలెక్టర్ అదనపు మున్సిపల్ కమిషనర్, డిపిఓ లను ఆదేశించారు. అదే విధంగా అన్ని ప్రభుత్వ సంస్థలను కూడా శుభ్రం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి డి ఆర్ ఓ చిరంజీవి, డిపిఓ భాస్కర్, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


## స్వీయ గణనలో చురుకుగా పాల్గొనండి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**జిల్లా ప్రజలు జన గణన లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ లో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విజ్ఞప్తి చేశారు.భారతదేశ జనగణన2027 లో భాగంగా శుక్రవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ విధానం ద్వారా, కలెక్టర్ తన మొబైల్ ఫోన్‌లో ద్వారా స్వయంగా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన కు సంబంధించి ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు నిర్వహించబడుతున్న స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. స్వీయ గణన ప్రక్రియ సులభమైనది, వేగవంతమైనది, పారదర్శకమైనదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద నుంచే పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. మొట్టమొదటిసారిగా జనగణన ప్రక్రియలో డిజిటల్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇది పారదర్శకతను మరియు సమగ్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమగ్ర సమాచారాన్ని నమోదు చేసి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా సేకరించబడే సమాచారం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ప్రజలు స్వీయ గణనలో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా టీడీపీ ఎంపిటిసి బోయ వెంకటేష్ జన్మదిన వేడుకలు



**మంత్రాలయం , ఏప్రిల్ 17,మనం న్యూస్ :-** మండల కేంద్రమైన మంత్రాలయంలో టీడీపీ ఎంపిటిసి బోయ వెంకటేష్ జన్మదిన వేడుకలు టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు హైస్కూల్ చైర్మన్ నరసింహులు , టీడీపీ నాయకులు మద్రి శివకుమార్ , మద్రి రాఘవేంద్ర , మంత్రాలయం యువకులు అధ్వర్యంలో శుక్రవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వాల్మీకి విగ్రహం యువకులు ఏర్పాటు చేసిన కేక్ కట్టింగ్ లో పాల్గొన్నారు , ముందుగా ఆయనకు శాలువా కప్పి ,కేకే కట్ చేసి ఆయనకు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు , మంత్రాలయం యువకులు పాల్గొన్నారు..

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట పట్టణంలోని 30పడకల ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.

# బైకును తప్పించబోయి... బోల్తా పడ్డ పెళ్లి ట్రాక్టర్



**ఆళ్లగడ్డ(చాగలమర్రి ) ప్రతినిధి ఏప్రిల్ 17 నంది పత్రిక** మండల పరిధిలోని శెట్టివీడు గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి పెళ్లి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో సుమారు 15 మంది గాయపడ్డారు. వివరాల మేరకు గొడుగునూరు గ్రామస్తులు కడప జిల్లా దూరు మండలం నారాయణ పల్లె గ్రామంలో జరుగుచున్న మళ్లీ పెళ్లి కార్యక్రమానికి ట్రాక్టర్లో సుమారు 30 మంది పైగా వెళుతుండగా ఎదురుగా వస్తున్న మోటార్ బైక్ నువ్వు తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. రోడ్డుపైన ఆరబోసిన మొక్కజొన్న పంట విత్తనాలు ఉండడంతో ఒక పక్కనే రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సంఘటన జరిగింది. దస్తగిరమ్మ, వలి, మస్తానమ్మ, కాలు విరగగా, బుజ్జి, మౌలాలి, రియాజ్, దస్తగిరి, లకు చెయ్యి విరిగింది. ఈ సంఘటనలో బైక్ పై వస్తున్న గొల్లపల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, ముత్యాలపాడు గ్రామానికి చెందిన ముహీద్ లకు గాయాలయ్యాయి. గాయపడిన వారంతా స్థానిక కేరళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాళ్లు చేతులు విరిగిన వారిని మెరుగైన వైద్యం కడపకు తరలించారు. ఎస్సై రాజారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులుగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. దిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకమనే విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. వారిది మహిళా వ్యతిరేక మైండ్‌సెంట్ అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రభుత్వాన్ని నమ్మాలని అన్నారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను విస్తరించేందుకు, వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముందుకు వెళు_న్నామని చెప్పారు. మూడు బిల్లులపై లోక్‌సభలో సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయని, ఇండియా కూటమి సభ్యుల్లో చాలామంది మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ సవరణ వల్ల దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం బలహీనమవుతుందనడంలో ఎంత మాత్రం నిజం లేదని అమిత్‌షా వివరించారు. బిల్లు ఆమోదం తర్వాత దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, శాతం రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రస్తుతం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో దక్షిణాదిన 129 మంది ఎంపీలు ఉన్నారని, అది 195కు పెరుగుతుందని చెప్పారు.

# వీధి కుక్కల నియంత్రణ, సంరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

**కమిషనర్ ఎన్.మౌర్య.**




**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నందిపత్రిక** నగరంలో వీధికుక్కల నియంత్రణ, సంరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరంలో కుక్కలు పట్టేందుకు నూతనంగా తెచ్చిన వాహనాన్ని శుక్రవారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వీధింకుక్కలను పట్టేందుకు సుమారు 13లక్షల రూపాయలతో ప్రత్యేక వాహన తెప్పించామని తెలిపారు. ఈ వాహనం ద్వారా వీధి కుక్కలను సురక్షితంగా పట్టుకుని, వాటికి స్టేరిలైజేషన్ మరియు టీకాల కార్యక్రమాలను నిర్వహించేందుకు ఉపయోగిస్తామని తెలిపారు. ఈ వాహనంలో ఒక డ్రైవర్, నలుగురు సిబ్బంది ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల భద్రత ను పెంపొందిచడంతో పాటు జంతు సంక్షేమాన్ని కూడా కాపాడడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, డి.ఈ.రమణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఉన్నారు.




# జిల్లాలో చురుగ్గా జనగణన ఎన్యుమరేషన్..!

**సెల్ఫ్ ఎన్యూమరేషన్ నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్**



**కడప, బ్యూరో చీఫ్ ఏప్రిల్ 17నంది పత్రిక :** భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో "సెన్సెస్ సెల్ఫ్ ఎన్యూమరేషన్" కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్వయంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో తన వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. కడప నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని "సెల్ఫ్ ఎన్యూమరేషన్" ప్రక్రియలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడం ద్వారా సమగ్ర మరియు ఖచ్చితమైన జనగణన సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్రం జనగణన ఎన్యుమరేషన్ కు సంబంధించి ఆన్ లైన్ నమోదు ప్రక్రియను తెలియజేశారు.

# ప్రజలకు మరింత భారం కానున్న సీట్ల పెంపు !

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబ డాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడువుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతు న్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీససం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ధి కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్‌ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక

ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు.

అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ÷ూజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

# బ్రహ్మంగారి మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలపై సమీక్ష సమావేశం



**బద్వేల్, ఏప్రిల్ 17 (నంది పత్రిక ):** బ్రహ్మంగారి మఠంలో త్వరలో నిర్వహించనున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకొని సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బద్వేల్ రాజశ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి ఎ .చంద్రమోహన్ అధ్యక్షత వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి, పలు సూచనలు చేశారు. మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం మండలం తహసిల్దార్, ఎంపీడీవో, ఎస్ఐలు కార్తిక్, రామచంద్రారెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు. అలాగే మండలం ఎంపీపీ వీరనారాయణ రెడ్డి, దేవాలయ మేనేజర్ ఈశ్వరయ్యతో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

# లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే: కేటీఆర్

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని,

కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



# తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు.

# టీవీ చుట్టూ అల్లిన పల్లెటూరి కథ




టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం నేపథ్యంలో తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అద్దెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొట్టె). ఎప్పుడైతే ఆ ఇంట్లోకి టీవీ వచ్చిందో.. అప్పటి నుంచి ఊరి వాళ్ల బుల్లితెర వినోదాలకు రాజప్ప ఇల్లు చిరునామాగా మారిపోతుంది. ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదే రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా ఆ టీవీని ఎవరెత్తుకెళ్లారు? తనపై నింద తప్పని నిరూపించుకునేందుకు సతీష్ ఏం చేశాడు? ఊరి పెద్దలిచ్చిన రెండు వారాల గడువు లోపల ఆ టీవీని.. అసలు దొంగల్ని తను కనిపెట్టాడా? లేదా? ఈక్రమంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. ఇప్పుడు అరచేతిలోకి వినోదాలు వచ్చేశాక టీవీ ప్రాధాన్యం ఎవరికీ పెద్దగా తెలియట్లేదు కానీ.. 80-90ల తరానికి టీవీ అంటే ఓ ఎమోషన్. బుల్లితెరతో పెనవేసుకున్న అనుబంధాలు.. దాని చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు బోలెడన్ని. ఈ 'తిమ్మరాజుపల్లి టీవీ'తో ఆ జ్ఞాపకాల్ని.. ఆ అనుబంధాల్ని మరోసారి గుర్తు చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు మునిరాజ్. మలయాళ సినిమాల్లోలా చాలా సింపుల్ లైన్‌పై నడిచే చిత్రమిది. ఈ కథ ప్రధానంగా ఓ టీవీ దొంగతనం చుట్టూ తిరుగుతుంటుంది. సింగిల్ లైన్ కథలతో ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టడం అంత తేలికేం కాదు. కథలో బలమైన డ్రామా పండినప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో 'తిమ్మరాజుపల్లి టీవీ' పాసైంది. దర్శకుడు ఈ కథకి ఎలాంటి కమర్షియల్ హంగులు జోడించకుండా చాలా నిజాయితీగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ ఊరివాళ్ల మనస్తత్వాల్ని.. అక్కడి సంస్కృతి, సంప్రదాయాల్ని పరిచయం చేస్తూ కథని ఆరంభించిన తీరు బాగుంటుంది. నాయకానాయికల ప్రేమకథ ఎప్పుడైతే రాజప్పకి తెలుస్తుందో.. అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఇక తన ఇంట్లో టీవీ దొంగతనానికి గురైనప్పటి నుంచి కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తెరపై కనిపించేదంతా కొత్త వా÷-లళైనా ప్రేక్షకులకు అదెక్కడా ఇబ్బందిగా అనిపించదు. నాయకానాయికలతో పాటు తెరపై కనిపించే ప్రతి పాత్రా సహజమైన నటనతో గుర్తుండిపోతుంది. ఎల్లమ్మ పాత్రతో ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. దర్శకుడు తాను అనుకున్న కథని నిజాయితీగా చెప్పడంలో విజయం సాధించాడు. దీన్ని పూర్తిగా ఓ ప్లలెటూరిలోనే చాలా సహజంగా తెరకెక్కించారు. కిరణ్ అబ్బవరం నిర్మాతగా తొలి ప్రయత్నంలో చాలా తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదభరితమైన సినిమా చూపించగలిగారు. పాటలన్నీ కథలో భాగంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం సినిమాకి మంచి ఫీల్‌ని జోడించింది. విజువల్స్ ఆకర్షణగా నిలుస్తాయి.

# 'సుయోధన' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

ప్రియదర్శి కథానాయకుడిగా విభిన్నమైన కథలను .. పాత్రలను ఎంచుకుంటూ వెళుతున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే 'సుయోధన'. సాయికుమార్ .. ప్రేమ కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, వైఎస్ మాధవరెడ్డి దర్శకత్వం వహించాడు. మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు నుంచే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.వరుణ్ (ప్రియదర్శి) హైదరాబాదులో సినిమాలకి సౌండ్ ఎఫెక్ట్స్ క్రియేట్ చేస్తుంటాడు. అతనికంటూ ఒక సొంత స్టూడియో ఉంటుంది. చిన్నప్పటి నుంచి వరుణ్ ని ఒక సమస్య వేధిస్తుంటుంది. 'సుయోధన' అంటూ ఎవరో తనని పిలుస్తున్నట్టుగా అతనికి ఒక వాయిస్ వినిపిస్తూ ఉంటుంది. అలా ఎందుకు జరుగుతుందనేది తెలుసుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. వరుణ్ తండ్రి ప్రకాశ్ (సాయికుమార్) రాజకీయనాయకుడిగా బిజీగా ఉంటాడు. భార్య రాధ (రాజశ్రీ నాయర్) అతనికి రాజకీయాలలో సూచనలు .. సలహాలు ఇస్తుంటుంది. ఒక రోజున వరుణ్ కి 'సంహిత' తారసపడుతుంది. డెమో ఫిల్మ్ చేయాలనుకున్న సంహిత, అతని హెల్ప్ కోరుతుంది. అప్పటి నుంచి వాళ్ల పరిచయం ప్రేమగా మారుతుంది. చాలా కాలం క్రితం 'వరలక్ష్మి' అనే ఒక నర్స్, మహతి అనే ఒక యువతిని గురించి రాసుకున్న 'డైరీ' ఆధారంగా తాను డెమో ఫిల్మ్ షూట్ చేస్తున్నట్టు వరుణ్ తో సంహిత చెబుతుంది. మహతి (ప్రేమ) అనే ఒక యువతి తన భర్త చేతిలో మరణిస్తూ, చివరి నిమిషంలో తన బిడ్డను కాపాడుతుంది. ఆమె త్యాగం వరుణ్ మనసును కదిలించివేస్తుంది. మహతి ఎవరు? భర్త చేతిలో ఆమె ఎందుకు చనిపోయింది? అనే విషయాలు తెలుసుకో వాలని



అతను నిర్ణయించుకుంటాడు. అందుకోసం రంగంలోకి దిగిన వరుణ్ పై, కొంతమంది ఆగంతకులు ఎటాక్ చేస్తారు. మహతి ఎవరు? ఆమె కథతో వరుణ్ కి గల సంబంధం ఏమిటి? అతనిపై దాడి చేయించింది ఎవరు? అతనికి తెలిసే చేదు నిజాలేమిటి? అనేది మిగతా కథ. జీవితంలో కొన్ని అంశాలు ఆసక్తికరంగా .. మనసును కదిలించేలా అనిపిస్తాయి. అలాంటి సంఘటనలను గురించిన నిజానిజాలు తెలుసుకోవాలనే కుతూహలం కూడా కలుగుతూ ఉంటుంది. ఆ దిశగా అడుగులు వేయడం మొదలుపెట్టినప్పుడు తెలిసే నిజాలు నివ్వెరపోయేలా చేస్తుంటాయి. అలాంటి ఒక పరిస్థితి ఈ సినిమాలో హీరోకి ఎదురైతే, అప్పుడతను ఏం చేశాడనే అంశం చుట్టూ ఈ కథ అల్లుకున్నారు. ఒక వైపు నుంచి సిన్సియర్ గా హీరో అన్వేషణ సాగుతూ ఉంటుంది. మరో వైపు నుంచి అతని మార్గానికి అవరోధాలు ఎదురవుతూ ఉంటాయి. రాజకీయాలు .. రౌడీ గ్యాంగులు .. పోలీస్ అధికారులు అతని ట్రాక్ ను టచ్ చేస్తూ ఉంటారు. అడపాదడపా డాక్టర్ల హడావిడి కూడా ఉండనే ఉంటుంది. హీరో వాటన్నింటినీ దాటుకుంటూ వెళుతున్న తీరును ఉత్కంఠ భరితంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. 'సుయోధన' అనే టైటిల్ వినగానే, ఇందులో సుయోధనుడిగా సాయికుమార్ ఏకపాత్రాభినయం .. భారీ డైలాగులు ఉంటాయని ప్రేక్షకులు అనుకోవడం సహజం. సరిగ్గా అలాంటి ఒక స్టేజ్ షోతోనే ఈ సినిమాను మొదలుపెట్టారు. సుయోధనుడి పాత్రతో ఈ కథకి సంబంధం ఉండటం వలన, ఆ టైటిల్ ను సెట్ చేసినట్టుగా మనకి అర్థమైపోతుంది. అర్థమయ్యేలా చెప్పారు కూడా. ఈ కథలో సస్పెన్స్ .. యాక్షన్ .. ఎమోషన్ .. ట్విస్టులు పలకరిస్తూ వెళుతుంటాయి. లవ్ ట్రాక్ కూడా ఉంది. కానీ ఎందుకనో దర్శకుడు ఆ వైపు పెద్దగా దృష్టి పెట్టలేదు. అందువలన హీరోయిన్ ఉందా అంటే ఉంది అంతే అనేట్టుగానే అప్పుడప్పుడు మాత్రమే తెరపై కనిపించడం జరుగుతుంది. ఇక ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ లో నాటకీయ పరిణామాలు మామూలే. ఈ కథలో హీరో తనకి కావలసిన సమాచారం కోసం పట్టువదలని విక్రమార్కుడి మాదిరిగా ముందుకు వెళుతుంటాడు. అయితే ముందు జరగబోయే కథను అప్పటికే గెస్ చేసిన ప్రేక్షకులు, అచ్చు అలాగే జరుగుతూ ఉండటంతో తాపీగా అలా కూర్చుండిపోయి చూస్తుంటారు అంతే. అసలు ఏం జరిగి ఉంటుందనేది తెరపై హీరోకంటే ముందుగానే ఆడియన్స్ పసిగట్టగలిగేలా ఉండటమే ఈ కథాకథనాలలోని ప్రధానమైన లోపంగా కనిపిస్తుంది. ప్రియదర్శి తన మార్క్ నటన కనబరిచాడు. హీరోయిన్ గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. సాయికుమార్ .. ప్రేమ .. రాజశ్రీ నాయర్ .. దేవీప్రసాద్ .. ఇలా మంచి సీనియర్ ఆర్టిస్టులే ఉన్నారు. ఎవరికి వారు పాత్ర పరిధిలో మెప్పిస్తూనే వెళ్లారు. కార్తీక్ కొప్పర ఫొటోగ్రఫీ .. జయ్ క్రిష్ నేపథ్య సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ ఓకే.

# తప్పు ట్రైన్ ఎక్కితే దిగిపోవడమే మంచిది.. విడాకులపై స్పందించిన హన్సిక!

తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# సంక్రాంతికి వస్తున్నాం..నాకెంతో ప్రత్యేకం




విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.

# బాలయ్యతో ఒకే హెలికాప్టర్‌లో డింపుల్ హయతి


నందమూరి బాలకృష్ణ తనదైన శైలిలో గుంటూరులో సందడి చేశారు. నిన్న లక్ష్మీపురంలో ఒక ప్రముఖ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి యువ నటి డింపుల్ హయాతితో కలిసి ఆయన విచ్చేశారు. వీరిద్దరూ హైదరాబాద్ నుంచి గుంటూరుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ఈ క్రమంలో డింపుల్ సెల్ఫీ వీడియో తీస్తుండగా, బాలయ్య ఎంతో సరదాగా క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ అల్లరి చేశారు. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి ఒకే ఈవెంట్‌లో కనిపించడంతో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వస్తున్న 'చీదీఖ 111' చిత్రంలో డింపుల్ నటిస్తోందన్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఇందులో ఆమె రెండో హీరోయిన్‌గా నటిస్తోందని ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.




## చిరాగ్ పాశ్వాన్÷-తో ఎలాంటి రిలేషన్ లేదు

### క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్

కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.




# త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ మరో సినిమా



ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.

# అల్లు అర్జున్ రాకాలో షారూఖ్ ఖాన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కలయికలో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అట్లీ ఇప్పటికే షారుఖ్‌తో 'జవాన్' వంటి భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అదే చొరవతో 'రాకా'లో ఒక కీలకమైన అతిథి పాత్ర కోసం షారుఖ్‌ను అడిగారని, అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. అల్లు అర్జున్ స్టైలిష్ యాక్షన్, అట్లీ టేకింగ్, దానికి తోడు షారుఖ్ ఖాన్ చరిష్మా తోడైతే ఈ చిత్రం గ్లోబల్ లెవల్‌లో రికార్డులు సృష్టించడం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com